T.T.D. Religious Publications Series No. 1013
Price :

## చూడ చూడ మాణిక్యాలు

చూడ జూడ మాణిక్యాలు చుక్కలు వలె నున్నవి
యీడులేని కన్ను లవె యినచంద్రులు ॥

కంటి గంటి వాడె వాడె ఘనమైనముత్యాల-
కంటమాల లవే పదకములు నవె
మింటిపొడవైనట్టి మించుకిరీటం బదె
జంటల వెలుగు శంఖచక్రా లవె ॥

మొక్కు మొక్కు వాడె వాడె ముందరనే వున్నాడు
చెక్కులవే నగవుతో జిగిమో మదె
పుక్కిట లోకము లవె భుజకీర్తులను నవె
చక్కనమ్మ అలమేలుజవరాలదె ॥

ముంగైమురాలును నవె మొలకతారును నదె
బంగారునిగ్గులవన్నె పచ్చుబ ట్టదె
యింగిత మెరిగి వేంకటేశుడిదె కన్నులకు
ముంగిటినిధానమైన మూలభూత మదే ॥

– తాళ్లపాక అన్నమాచార్యులవారి అధ్యాత్మ సంకీర్తన

* * *

Published by Sri M.G.Gopal, I.A.S., Executive Officer, Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at T.T.D. Press, Tirupati.

# ఏడు కొండలు

– జూలకంటి బాలసుబ్రహ్మణ్యం

తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి

# ఏడు కొండలు

రచన
జూలకంటి బాలసుబ్రహ్మణ్యం
తిరుపతి

ప్రచురణ
తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.
2014

# EDUKONDALU

*by*
**Julakanti Balasubrahmanyam**

T.T.D. Religious Publications Series No. 1013
© All Rights Reserved

First Print : 2013

*Re-Print:- 2014*

Copies: 3000

*Published by :*
**M.G.GOPAL**, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

*D.T.P:*
Editor in Chief Office,
T.T.D, Tirupati.

*Printed at :*
***Tirumala Tirupati Devasthanams Press,***
Tirupati.

## ముందుమాట

ప్రపంచప్రసిద్ధమైన పుణ్యక్షేత్రం తిరుమల. ఈ దివ్యస్థలంలో ఎప్పుడో ఏనాడో శ్రీవేంకటేశ్వరుడు స్వయంవ్యక్తమూర్తిగా ఆవిర్భవించి అర్చనలందుకొంటున్నాడు. ఈ స్వామి వెలసిననాటి నుండి ఎన్నో పేర్లతో పిలువబడినా ఆ స్వామికి ఒక అద్భుతమైన పేరు సార్థకమై భక్తలోకంలో స్థిరంగా నిలిచిపోయింది. అదే **‘ఏడు కొండలవాడు’** అని.

**శేషాచలం, గరుడాచలం, వేంకటాచలం, నారాయణాచలం, వృషభాచలం, వృషాచలం, అంజనాచలం**... ఇలా ఏడుకొండల మీద వెలసినందువల్ల **ఏడుకొండలవాడని** పిలువబడుతున్నాడు. ఈ ఏడు కొండలు ఎలా ఏర్పడ్డాయి. వాటికి సంబంధించిన గాథలు ఏమిటి? అనేక కొండల సమాహారంగా కనపడే ఈ క్షేత్రానికి ఇంకా ఏమైన పేర్లు ఉన్నాయా? ఇలా అనేక సందేహ పరంపరలు భక్తులకు కలగవచ్చు. కలుగుతాయి కూడ.

ఏడుకొండల దివ్యగాథలను, వృత్తాంతాలను భక్తులకు తెలియచేసి, వారికి కలిగే ఇలాంటి సందేహ పరంపరల్ని కొంతవరకైనా నివృత్తి చెయ్యాలన్న సంకల్పంతో శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యంగారు చేసిన ప్రయత్నఫలితమే మీ చేతుల్లో వున్న పుస్తకం **“ఏడు కొండలు”**.

**‘ఏడు కొండల’** దివ్యవృత్తాంతాలతో పాటు, ఆ యా కల్పాల్లో, ఆ యా యుగాల్లో ఈ దివ్య క్షేత్రానికి కలిగిన అనేకానేకమైన పేర్లు, వాటిని గూర్చిన వివరాలు, ఆసక్తికరమైన కథలతో పాటు, తిరుమలయాత్రలో పాటించవలసిన నియమాలను, తిరుమలలో చేయవలసిన దానధర్మాలను కూడ తెలియజేసిన

శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం గారికి **ఏడుకొండలవాడి** కొండంతదయ నిండుగా వుండాలని ఆకాంక్షిస్తున్నాను.

దేవస్థానంవారి ధార్మిక ప్రచురణగా వెలువడిన ఈ **"ఏడు కొండలు"** పుస్తకాన్ని పాఠకులు భక్తిశ్రద్ధలతో పఠించి పునీతులు కాగలరని ఆశిస్తూ...

*సదా శ్రీవారి సేవలో....*

(సంతకం)
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు
తిరుపతి.

# కృతజ్ఞతాంజలి

**శ్రీ శేషశైల గరుడాచల వేంకటాద్రి**
**నారాయణాద్రి వృషభాద్రి వృషాద్రి ముఖ్యామ్**
**ఆఖ్యాం త్వదీయ వసతే రనిశం వదంతి**
**శ్రీ వేంకటాచలపతే తవ సుప్రభాతమ్**

ఇలా ప్రతిరోజు తెల్లవారుజామున తిరుమలేశుడు ఏడుకొండలవాడిగా మేల్కొల్పులు పాడించుకుంటున్నాడు.

ఏడుకొండల్లో వున్నందు వల్ల శ్రీనివాసభగవానుడు **"ఏడు కొండలవాడు"**గా, **"కొండలలో నెలకొన్న కోనేటి రాయడు"**గా **"కొండలంతటి వరాలు గుప్పెడివాడు"**గా భక్తుల గుండెల్లో గుడి కట్టుకొని చిరస్థాయిగా నిలిచివున్నాడు.

అటు శ్రీనివాసునికి, ఇటు భక్తులకు ప్రియాతి ప్రియమైన ఏడుకొండలు తిరుమలక్షేత్రంలో ఎక్కడవున్నాయి. వరుసగా ఒకదానిమీద ఒకటివున్నాయా. వాటి కా పేర్లు ఎలా ఏర్పడ్డాయి. ఈ ఏడుకొండలపేర్లే గాక..ఇంకా పేర్లు ఏమైన వున్నాయా? వుంటే ఆ పేర్లు ఎలా ఏర్పడ్డాయి?... ఇలాగ అనేక ప్రశ్నలు అందరికీ కలుగుతాయి. కలగడమేగాక, ఈ ఏడు కొండల విశేషాలను తెలుసుకోవాలన్న ఆతృతా, ఆర్తీ ప్రతి ఒక్కరికీ కలుగుతుంది.

తి.తి.దేవస్థానం ఉద్యోగిగా, ముఖ్యంగా 'సప్తగిరి' పత్రికావిభాగంలో పని చేసివున్న నాకు, భక్తులకు వున్న ఈ సందేహ పరంపరల్ని నివృత్తి చెయ్యడం నా ధర్మమేకాక బాధ్యతా, విధీ కూడ అని భావించి **"ఏడుకొండలు"** అనే పుస్తకాన్ని, రచనచేసి ఏడుకొండలవాడి పాదపద్మాలకు సమర్పించడం జరిగింది.

అనేక ధార్మిక ప్రచురణలను వెలువరించడంతోపాటు, తి.తి.దేవస్థానం వారి ఆలయాలు, శ్రీనివాసమంగాపురం, శ్రీకోదండరామాలయం వంటి అనేక ఆలయాల చరిత్రలను భక్తులకు అందించడమే కాక ఆ యా ఆలయాల్లో

బ్రహ్మోత్సవాలను, వినూత్నంగా పెద్దఎత్తున నిర్వహింపజేయడంలో, ఒక ప్రత్యేకశైలిని అనుసరిస్తున్న పరమధార్మికులు, నిరంతరభక్తజన సేవాతత్పరులు, సంగీతసాహిత్యజ్ఞులు తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారులు శ్రీ లంక వెంకట సుబ్రహ్మణ్యం, I.A.S., గారికీ–

అట్లాగే తి.తి.దేవస్థానం సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీ.పి.వెంకటరామిరెడ్డి, I.A.S., గారు, నిరంతర పరిపాలనా మగ్నులయినప్పటికి వీరికి వున్న ధార్మికగ్రంథపరిశీలన, పఠన, సంగీతసాహిత్యాభిలాష అనన్యసామాన్యం. ప్రత్యేకంగా రచయితలచేత ధార్మికగ్రంథరచనలు చేయించడంలో వీరి ప్రోత్సాహం చాలగొప్పది. ఇలా వీరిరువురికీ భక్తిపూర్వక ప్రణామాంజలులు.

నా,యీ, రచనలను అన్నింటిని వెన్నుతట్టి ప్రోత్సాహ పరుస్తున్న ఎడిటర్–ఇన్–చీఫ్ ఆచార్య రవ్వా శ్రీహరిగారికీ, గ్రంథాలను ఎప్పుడు ఇచ్చినా, ఏవేళ, ఇచ్చినా వెనువెంటనే ముద్రింపజేయడంలో ఉత్సాహాన్ని చూపుతున్న దేవస్థానం పి.ఆర్.ఓ.శ్రీ.టి.రవిగారికీ, ముచ్చటైన రంగుల్లో ఆకర్షణీయంగా ముద్రించిన దేవస్థానం ప్రెస్స్ మేనేజరు శ్రీ వి.సాంబశివరావుగారికీ, వారి సిబ్బందికి కృతజ్ఞతాపూర్వకనమస్కారములు.

కొండంత దేవునికి కొండంత పత్రి సమర్పించలేకపోయినా, ఈ **"ఏడుకొండలు"** చిన్న పుస్తక సుమాన్ని కూడా అత్యంత ప్రియంగా తన పాదపద్మాలమీద చేర్చుకున్నందులకు ఆ ఏడుకొండలవాడికి భక్తితో ప్రణమిల్లుతున్నాను.

**శ్రీవిజయ**
**వైశాఖ పూర్ణిమ**
**అన్నమయ్యజయంతి**
**25-5-2013**

రచయిత
**జూలకంటి బాలసుబ్రహ్మణ్యం**
తిరుపతి

## విషయసూచిక


| | | |
|---|---|---|
| ముందుమాట | -- | iii |
| ఏడు కొండలు | -- | 1 |
| శేషాచలం | -- | 3 |
| వేంకటాచలం | -- | 7 |
| శంఖణుడి కథ | -- | 9 |
| మాధవుడు అనే విప్రుని కథ | -- | 10 |
| నారాయణాచలం | -- | 11 |
| గరుడాచలం | -- | 13 |
| వృషాచలం | -- | 16 |
| వృషభాచలం | -- | 17 |
| అంజనాచలం | -- | 21 |
| నాలుగుయుగాల్లో నాలుగు పేర్లు | -- | 25 |
| అనేక కల్పాల్లో అనేక పేర్లు | -- | 26 |
| బంగారు పర్వతం – కనకాద్రి | -- | 27 |
| వరాహాచలం | -- | 29 |
| క్రీడాద్రి | -- | 30 |
| వైకుంఠాద్రి | -- | 30 |
| సుమేరు పర్వతం | -- | 32 |
| పుష్కరాద్రి | -- | 32 |

| | | |
|---|---|---|
| తీర్థాద్రి | -- | 33 |
| సింహాచలం | -- | 34 |
| చింతామణి పర్వతం | -- | 35 |
| నీలాద్రి | -- | 36 |
| శ్రీనివాసాద్రి | -- | 36 |
| ఆనందాద్రి | -- | 38 |
| వేదాద్రి | -- | 39 |
| జ్ఞానాద్రి | -- | 40 |
| సప్తర్షికృత శ్రీవేంకటేశస్తోత్రం | -- | 41 |
| శ్రీశైలం | -- | 46 |
| తిరుమల యాత్రలో నియమాలు | -- | 47 |
| దాన ధర్మాలు - ఫలితాలు | -- | 50 |
| సమర్పణం | -- | 56 |


**ఓం నమో వేంకటేశాయ**

# ఏడు కొండలు

అనంతమయిన బ్రహ్మాండ భాండాలతో అలరారుతున్న ఈ విశ్వాంతరాళం ఎంతో విశాలమైంది. గహనమైంది కూడ. అందులో భూమండలం కేవలం సూక్ష్మాతి సూక్ష్మమైన చిన్న ఉపగ్రహం మాత్రమే. అంతమాత్రమే అయినా ఈ భూమండలం తేజస్సులు మాత్రం దేదీప్యమానంగా విశ్వాంతరాళమంతా విరజిమ్మబడుతున్నాయి. దానికి ప్రధానమైన కారణం ఒక్కటే ఒక్కటి! భూమండలంపై వేంకటాచలక్షేత్రం నెలకొని వుండడం!

భువిపై ఈ క్షేత్రం ఏనాటినుండి వుందో ఎప్పటినుండి వుందో చెప్పలేం. ఎన్ని యుగాలనుంచి వుందో చెప్పడానికి ఎవరికీ తెలియదు కూడ. కాని ఒక్కటి మాత్రం నిజం!

భూలోకంలో వెలసిన నాటి నుండి ఈ పుణ్యక్షేత్రానికి ఆ యా యుగాల్లో, ఆ యా కాలాల్లో ఎన్నెన్నో పేర్లు ఏర్పడ్డాయి. అలాగే ఆ క్షేత్రంపై వెలసి దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామికి కూడా ఎన్నో పేర్లు, మరెన్నెన్నో నామాలు కలిగాయి.

ఆకాశంలోని నక్షత్రాలను, భూమి మీది ధూళిరేణువులనూ, సముద్రాల్లోని నీటికణాలను లెక్క పెట్టవచ్చునేమో! కాని అనాదిగా తిరుమలకొండకూ, ఆ కొండశిఖరాన వెలసి వున్న స్వామికీ వున్న పేర్లను మాత్రం లెక్కించడం సాధ్యం కానే కాదు.

శ్రీ వేంకటేశ్వరుని అసలు తత్త్వం ఏమిటో ఎవరికీ అంతుబట్టక పోయినా, ఆయన అసలైన పేర్లు ఏవో ఎవరికీ తెలియకపోయినా భక్తకోటి మాత్రం ఆ స్వామిని తమకిష్టమైన పేర్లతో పిలిచారు. పిలుస్తూనే వున్నారు.

ఇలా అనాదిగా ఎందరిచేతనో, మరెందరి చేతనో అనేక విధాలుగా దర్శింపబడిన శ్రీవేంకటేశ్వరుణ్ణి తమకు ఇష్టమైన పేర్లతో తమకు నచ్చిన పేర్లతో ఆర్తిగా ఆర్ద్రగా పిలుస్తుంటారు. శ్రీనివాసుడనీ, వేంకటేశ్వరుడనీ, తిరుమలేశుడనీ, అడుగడుగు దండాలవాడనీ, ఆపద్బాంధవుడనీ... ఇలా ఎన్నో పేర్లతో పిలుస్తూ తమ ప్రార్థనల్ని వినిపిస్తారు. తమ తమ మొక్కు బళ్లను చెల్లిస్తారు. తమ తమ కోరికలను కోరుకుంటారు. భక్తులు ఏ పేరుతో పిలిచినా, ఏ కోరికలు కోరినా, ఏ భాషలో విన్నవించుకున్నా.. అందరికి తగినట్లుగానే పలుకుతూ వారికి వరాలిస్తూ 'కోరిన వరాలరాయడి' గా ప్రసిద్ధి చెందిన స్వామి తిరుమల ఘన వేంకటప్రభువు!

అందులోను భక్తులు తరచుగా పరమ ప్రీతిగా ప్రియంగా స్వామివారిని పిలిచే పేరు "ఏడుకొండలవాడా!" అని. ఆ పేరు వింటేనే చాలట! తిరుమలేశునికి ఎక్కడలేని మహా ఆనందమట! ఆ ఆనందంతో స్వామి ఉబ్బితబ్బిబ్బైపోతాడు! ఏడుకొండలవాడా! అని పిలిస్తే చాలు! ఈ ఏడుకొండలు నావే కదా! ఈ ఏడుకొండలకు ప్రభువును నేనే కదా! అని ఉక్కిరి బిక్కిరి అవుతూ ఊపిరి సలపనట్లుగా భక్తులకు అడిగిన కోరికలన్నీ ఆనందంగా తీరుస్తాడట తిరుమలేశుడు.

ఇటు భక్తులకు, అటు తిరుమలేశునకు ఇంతగా పరమానందాన్ని కలిగించే "ఏడుకొండలవాడు!" అనేపేరు ఆ స్వామికి ఎందుకు కలిగింది? ఎలా కలిగింది? ఆ స్వామి అలా పిలవబడడానికి కారణాలు ఏమైన వున్నాయా? అంటే!

అవునండీ! అద్భుతమయిన ఆశ్చర్యకరమైన కారణాలు వున్నాయి. శ్రీనివాస భగవానుడు వేంచేసి వున్న దివ్యస్థలాన్ని బట్టి ఏడుకొండల వాడా! అని పిలువబడుతున్నాడు.



ఏడు కొండలు ఎక్కడో లేవు. ఇదిగో ఈ తిరుమల పర్వత సానువుల్లో చోటు చేసుకున్న పర్వత శిఖరాలే ఏడుకొండలు!

శేషాచలం, వేంకటాచలం, నారాయణాచలం గరుడాచలం, వృషాచలం, వృషభాచలం, అంజనాచలం... ఇవే ఏడుకొండలు. **అచలం** అంటే కొండ. దాన్నే **అద్రి** అని కూడ అంటారు.

ఇలా ఈ ఏడుకొండలు చుట్టూరా వుండగా ఏడుకొండల మధ్యలో వక్షఃస్థల శ్రీమహాలక్ష్మితో కూడ అద్భుతమైన సాలగ్రామ శిలామూర్తిగా శ్రీనివాసుడు స్వయంవ్యక్తుడై ఆవిర్భవించినందువల్ల "ఏడుకొండలవాడు! అని పిలువబడుతున్నాడు.

తిరుమలేశునికి ఇంతగా పేరు తెచ్చిపెట్టిన ఏడుకొండల పేర్లు వాటికి సంబంధించిన ఆసక్తికరమైన కథలను తెలుసుకుందాం.

## శేషాచలం

**శేషాచలం** మొదటి కొండ! దీన్నే **శేషాద్రి** అని కూడా అంటారు. దీన్ని గురించి ఒక అందమైన కథను చెప్పుకుందాం.

ఇది చాలకాలం క్రిందట జరిగిన సంగతి!

ఒకప్పుడు వేయిపడగల ఆదిశేషుడు, వాయుదేవుడు ఒకరికొకరు ఎదురుపడ్డారు. పలకరించుకున్నారు. నీవు ఎలాగున్నావు అంటే నీవు ఎలాగున్నావు అని.

నా కేమిటి తక్కువ? నేను శ్రీమన్నారాయణునికి అహరహం శయ్యగా, పాదుకగా, గొడుగుగా పాదపీఠంగా సేవ చేస్తున్నవాణ్ణి. నా కేమిటి తక్కువ. నేను బాగున్నాను. మరి నీ సంగతేమిటి? వాయుదేవా! నీ వేమో దేశదిమ్మరివి.

పైగా చపలచిత్తంతో తిరిగేవాడివి. నీ కేమి తెలుస్తుంది నా గొప్పతనం, అన్నాడు ఆదిశేషుడు.

వెంటనే వాయుదేవుడు కోపిస్తూ, "నీవు ఒక సర్పానివి మాత్రమే. వేయినాలుకలున్నంత మాత్రాన అలా మాట్లాడ్డం తగదు. నీ వాచాలత్వం తగ్గించుకో! శ్రీమన్నారాయణునికి ఆ మాత్రం సేవ చేస్తున్నందువల్లే నీకు ఆ కొద్దిగానైనా పేరొచ్చింది. అంతమాత్రం చేత విర్ర వీగకు.

మరి నేనంటావా! దిక్పాలకుణ్ణి. సమస్త లోకాల్లోని జీవరాసులన్నీ నావల్ల మనుగడ సాగిస్తున్నాయి. అంతెందుకు? గాలినే ఆహారంగా తింటూ నావల్ల బతుకుతున్న సర్పానివి. నీవా గొప్పవాడివి? చాలు చాలు నీ బడాయి – అంటూ వాయుదేవుడు ఆదిశేషుణ్ణి ఈసడించుకున్నాడు.

ఇద్దరికీ మాటా మాటా పెరిగింది. చివరకు "నేను గొప్పంటే నేను గొప్ప అనీ, కాదు కాదు నీ కంటే నేనే గొప్ప అని వాదులాడుకున్నారు.

ఇంకేమి! నాకంటే బలవంతుడవయితే నన్ను కొంచెం కదల్చు. చాలు నీ గొప్పదనం బయటపడుతుంది అంటూ ఆదిశేషుడు, వైకుంఠంలోని క్రీడాద్రిని గట్టిగా చుట్టుకున్నాడు.

అంతే వాయుదేవుడు తన బలాన్నంతా సమకూర్చుకొని ఉన్నపళంగా ఒక్కసారి ఉఫ్! అంటూ ఊదాడు. ఇంకేముంది! ఆ క్రీడాద్రితోపాటు దానికి చుట్టుకొన్న ఆదిశేషుడు ఇదిగో ఈ భూలోకంలో ఎగిరి వచ్చి పడ్డాడు. దీంతో ఆదిశేషునికి గర్వభంగం అయింది.

ఎంతటివారికైనా అహంకారం పతనహేతువు కదా!

పాపం! ఆదిశేషుడు తనకు జరిగిన అవమానభారంతో కుంగిపోయాడు. ఎంతైనా ఆదిశేషుడు భక్తుడు కదా! మీదుమిక్కిలి సేవకుడు కూడా. అందువల్ల



శ్రీనివాసుడు ఆదిశేషుణ్ణి ఓదారుస్తూ "శేషుడా! నీవు ఎంతమాత్రం చింతించవద్దయ్యా! నిన్ను నా బాహువులకు ఆభరణంగా ధరించి నాగాభరణునిగా దర్శనమిస్తాను. అంతేకాదు. ఈనాటి నుండి ఈ క్రీడాద్రి "శేషాచలం" గా ప్రసిద్ధి పొందుతుంది" అందువల్ల కూడా భక్తులు నన్ను 'శేషాచలపతి' గా పిలుస్తారు. అని వరం ఇచ్చాడు. ఆదిశేషుడు ఇది ఒకందుకు మేలే జరిగింది కదా ఆనందించాడు.

**"శేషాద్రి"** గా పేరొందిన ఈ కొండను

**శ్లో॥ యోజనత్రయవిస్తారం త్రింశద్యోజనమాయతమ్**
**శేషాకారం హరేశ్శైషం శేషికాం సర్వదేహినామ్,**

**– వరాహపురాణం. 34 అధ్యా – 17–18 శ్లో.**

అంటూ వరాహపురాణం పేర్కొంటోంది. ముప్పైయోజనాల పొడవుతో మూడుయోజనాల విస్తీర్ణంతో సాక్షాత్తు శేషసర్పాకృతితోనే ప్రకాశిస్తోందట ఈ శేషాచలం కొండ!

సాక్షాత్తు శ్రీనివాసభగవానుడు కొలువై వున్న ఈ కొండ తన పేరుతో ప్రసిద్ధి పొందాలన్న ఆదిశేషుని కోరికను శ్రీనివాసుడు తీర్చాడని.

**శ్లో ॥ అనంతోహం మహాదేవ! స్థాస్యామి గిరిరూపధృక్**
**భవతా రమయా సార్థం! మమ సానుషు రమ్యతామ్**

**– బ్రహ్మాండపురాణం – అధ్యా 2 – శ్లో. 5**

అని బ్రహ్మాండ పురాణం పేర్కొంటోంది.

ఇంచుమించుగ ఇదేగాథను తరిగొండవెంగమాంబ ఇలా పేర్కొనింది.

**కం. శేషాకృతితో నమరి వి–**
**శేషత్వమునొంది సర్వశేషినిఁ దనపై**

**భూషణముగ నిడికొనుటను–**
**శేషాచల మనఁగ భూప్రసిద్ధమయ్యెన్**

**– శ్రీవేంకటాచలమాహాత్మ్యం. ఆశ్వా-1 పద్యం-123**

అందుకే అన్నమాచార్యులు కూడ తాను తొట్టతొలిగా దర్శించిన వేంకటాచలపర్వతాన్ని.

**అదివో! అల్లదివో! హరివాసము**
**పదివేల శేషుల పడగలమయము**

**చెంగట నల్లదివో శేషాచలము**
**నింగి నున్న దేవతల నిజవాసము**
**ముంగిట నల్లదివో మూలనున్న ధనము**
**బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము**

అంటూ ఇది శేషాచలపర్వతంగా, ఆదిశేషుని పడగలమయంగా వర్ణిస్తాడు.

అంతేకాక ఇంకోచోట అన్నమయ్య.

**"వేదములే శిలలై వెలసినదీ కొండ!**
**యేదెస పుణ్యరాసులే యేరులైనదీ కొండ!**
**గాదిలి బ్రహ్మాది లోకములకొనల కొండ!**
**శ్రీదేవుడుండేటి శేషాద్రి ఈ కొండ!!**

అంటూ శేషాద్రి క్షేత్రమహిమను కీర్తిస్తాడు.

శ్రీ 'శేషాద్రిగా' పిలువబడుతున్న ఈ సర్పాకార పర్వత శ్రేణిలో తల భాగాన శ్రీవేంకటేశ్వరుడు (తిరుమల), నడుము భాగాన శ్రీనృసింహుడు (అహోబలం), తోక భాగాన శ్రీమల్లికార్జునుడు (శ్రీశైలం) వెలసివున్నారని పురాణ ప్రసిద్ధి!



ఓం శేషాచలపతి గోవిందా! అంటూ శేషాచలాన్ని స్మరిస్తూ యాత్ర చేస్తే చాలు. సమస్త నాగదోషాలు పరిహారమవుతాయి. వివాహప్రాప్తి, సంతానప్రాప్తి కలుగుతుంది.

* * *

## వేంకటాచలం

రెండవ కొండ **వేంకటాచలం!** అదే **వేంకటాద్రి!**

**వేంకటాద్రి** మహిమను భవిష్యోత్తరపురాణం చాల గొప్పగా ఇలా పేర్కొంటున్నది.

**శ్లో ॥ సర్వపాపాని వేం ప్రాహుః కటః తద్దాహ ఉచ్యతే**
**తస్మాద్వేంకటశైలోఽయం లోకే విఖ్యాతకీర్తిమాన్.**

**– భవిష్యోత్తరపురాణం. అధ్యా -1 శ్లో.-221-222**

'వేం' అంటే పాపాలు. అవి ఎలాంటి పాపాలైనా సరే. కటః అంటే దహించేది. అనగా తెలిసీ తెలియక చేసిన ఎలాంటి పాపాలైనా ఈ వేంకటాద్రిపర్వతం దహింపజేస్తుందట! ఎలా అంటే భయంకరమైన దావాగ్నిలో ఒకే ఒక పిడచడంత దూదిపింజ పడితే దాని దరికి పోకుండానే ఆ వేడికి కాలి బూడిద అయి ఎగిరిపోయినట్లుగా, వేంకటాచల పర్వతం పాపాల్ని నశింపజేస్తుంది.

అంతేకాదు, వరాహపురాణం కూడ ఈ వేంకటాచల క్షేత్రం మహత్వాన్ని ఇలా వర్ణించింది.

**శ్లో ॥ వేంకారో౽మృతబీజస్తు కటమైశ్వర్య ముచ్యతే**
**అమృతైశ్వర్య సంఘత్వాత్ వేంకటాద్రిరితి స్మృతః**

**- వరాహ. పు - అధ్యా 36 - శ్లో. 31**

'వేం' అనగా అమృతం. కట శబ్దానికి ఐశ్వర్యం అని అర్థం. ఈ కొండ తనను ఆశ్రయించిన భక్తులకు అమృతత్వాన్ని, ఐశ్వర్యాన్ని ప్రసాదిస్తుందట. అంటే ఒకేసారి ఇటు లౌకికమైన సంపదలతోపాటు, అటు పారలౌకికమైన ముక్తిని ప్రసాదిస్తుందట ఈ వేంకటాద్రి కొండ!

సార్థకనామధేయంతో వరలుతున్న ఈ పర్వతాన్ని భక్తకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ తన కావ్యంలో ఇలా వర్ణించింది.

**ఆ ॥ అమరఁగా వకార మమృతబీజము, కట**
**ములును సంపదర్థముల వెలుంగు;**
**నట్టి మూఁడు గూడి యమృత, సంపదలిచ్చు**
**నందుచేత వేంకటాద్రి యయ్యె**

**శ్రీ.వేంకటాచలమాహాత్మ్యం. ఆశ్వా-1 పద్యం-125.**

అందుకే అన్నమాచార్యులు కూడా ఇలా కీర్తించాడు

**కట్టెదుర వైకుంఠము కాణాచయిన కొండ !**
**తెట్టెలాయ మహిమలే తిరుమల కొండ !!**

**వరములు కొటారుగా వక్కణించి పెంచేకొండ !**
**పరగు లక్ష్మీకాంతు సోబనపు కొండ !**
**కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ !**
**విరివైన దిదివో శ్రీ వేంకటపు కొండ !!**



అలాగే మరోచోట అన్నమయ్య

**అదె వేంకటాచల మఖిలోన్నతము**
**అదివో బ్రహ్మాదుల కపురూపము**
**అదివో నిత్యనివాసమఖిలమునులకు**
**అదె చూడు డదె మొక్కు డానందమయము**

**కైవల్యపదము వేంకటనగ మదివో !**
**శ్రీవేంకటపతికి సిరులైనది.**
**భావింప సకలసంపదరూపమదివో !**
**పావనముల కెల్ల బావనమయము !!**

అంటూ వేంకటాద్రిమహిమను కీర్తించాడు.

ఇంత గొప్పగా వర్ణింపబడిన ఈ వేంకటపు కొండ ఎవరికైన పాపాలు పోగొట్టిందా? మరెవరికైనా ఐశ్వర్యాల్ని ప్రసాదించిందా? అంటే!

ఔను! ఔనౌను! అంటూ ఈ క్రింద పేర్కొన్న రెండు గాథలు తెలియజేస్తున్నాయి.

## శంఖణుడి కథ !

శంఖణుడనే రాజు కాంభోజ రాజ్యాన్ని పాలించేవాడు. భోళా మనిషి. అందరినీ నమ్మేవాడు. అందువల్లే మోసగింప బడ్డాడు. ప్రారబ్ధకర్మ వల్ల రాజ్యం పోగొట్టుకొన్నాడు. అక్కడా ఇక్కడా తిరుగుతూ వేంకటాచల క్షేత్రానికి వచ్చాడు. అంతే! ఆ క్షేత్ర స్పర్శ వల్ల అతని పూర్వజన్మ పాపాలన్నీ సులువుగా నశించాయి. వేంకటాచలపతిని కూడ దర్శించాడు. ఇంకేముంది! పర్వతం

స్పర్శ వల్ల పాపాలు పోయి పవిత్రుడైనాడు. శ్రీ శ్రీనివాసప్రభువు దయవల్ల పోయిన రాజ్యం దక్కింది. చివరకు మోక్షాన్ని కూడా పొందాడు.

* * *

## మాధవుడు అనే విప్రుని కథ !

ఇది ఇంకొక కథ!

మాధవుడు అనే సద్బ్రాహ్మణుడు దక్షిణకాశి అని పిలువబడే శ్రీకాళహస్తి క్షేత్రంలో వుండేవాడు. సదాచార సంపన్నుడు యువకుడయిన మాధవునికి అప్సరసలాంటి అందమైన, సుగుణాలరాశి అయిన "చంద్రలేఖ" అనే బ్రాహ్మణ కన్యతో వివాహం అయింది. కొంతకాలం సంసారం సక్రమంగా సాగింది. కాని ఏ పాపగ్రహ ఫలితమో కాని ఒకనాడు 'కుంతలా' అనే వేశ్య అతని కంటపడింది. అంతే! ఆమెకు వశుడయ్యాడు.

తల్లిదండ్రుల్ని, భార్యను ఇల్లు వాకిలి విడిచి పెట్టాడు. రాత్రింబవళ్లు ఆమెతోనే తిరిగాడు. భ్రష్టుడయ్యాడు. తల్లీదండ్రీ గతించారు. భార్య ఏమయిందో తెలియదు. చివరకు వేశ్య కూడ గతించింది. దీంతో మతి చలించిన భ్రష్ట బ్రాహ్మణుడు తెగిన గాలిపటంలాగా అక్కడా ఇక్కడా తిరుగుతూ వేంకటాచల పర్వతం మొదట్లో వుండే కపిలతీర్థ క్షేత్రానికి చేరుకొన్నాడు.

అక్కడ ఆ క్షేత్రంలో కొందరు తమ పెద్దలకు శ్రాద్ధం పెట్టడం చూచాడు. అయ్యో! గతించిన తన తల్లిదండ్రులకు ఏమీ చేయలేక పోయానే అని పశ్చాత్తాపంతో మట్టితో శ్రాద్ధాన్ని నిర్వహించాడు. తర్వాత వేంకటాచల



పర్వతారోహణం చేశాడు. అతను వేస్తున్న ఒక్కొక్క అడుగుకు ఒక్కొక్క పాపం నశిస్తూ తేజోవంతుడయ్యాడు. ఆ తర్వాత వేంకటేశ్వరుణ్ణి దర్శించాడు.

స్వామి ప్రత్యక్షమై అనేక వరాలిచ్చాడు. మాధవశర్మ చేసిన పాపరాశులన్నీ ఈ వేంకటపు కొండ స్పర్శవల్ల పూర్తిగా నశించాయి. మరుజన్మలో 'ఆకాశరాజు'గా పుట్టాడు. సాక్షాత్తు లక్ష్మీదేవిని 'పద్మావతి' పేరుతో పుత్రికగా పొంది, వేంకటేశ్వరునికి కన్యాదానం చేశాడు. జన్మాంతంలో కైవల్యాన్ని పొందాడు. సాక్షాత్తు శ్రీస్వామి దర్శనమిస్తున్న శ్రీవారి ఆలయ ప్రాంతమే వేంకటపు కొండ!

అందువల్ల ఇది ఘనమైన **వేంకటాద్రి!** దీని మహత్తు అమోఘం! అద్భుతం! అనంతం!

"శ్రీవేంకటాచలపతి గోవిందా! శ్రీ వేంకటాద్రీశ గోవిందా! అంటూ ఈ సప్తగిరులను ఎక్కితే చాలు. సమస్త పాపాలు నశిస్తాయి. కోరిన కోరికలన్నీ సిద్ధిస్తాయి.

* * *

## నారాయణాచలం

మూడవ కొండ **నారాయణాచలం!** అదే **నారాయణాద్రి!!**

ఈ కొండకూ అద్భుతమైన ఒక కథ ఉంది.

సుమారు ఐదువేలఏండ్ల క్రిందట వక్షఃస్థల శ్రీమహాలక్ష్మితో శ్రీమన్నారాయణుడు శ్రీ వైకుంఠాన్ని వదలిపెట్టి ఈ పర్వతంపై కాలు మోపినాడు. అందువల్లే ఇది **'నారాయణాద్రి'** అయింది. అందుకు గుర్తుగా **'నారాయణగిరి'** అని పిలువబడే శిఖరంపై నారాయణుని దివ్యపాద

పద్మద్వయం ప్రతిష్ఠింపబడినాయి. వాటిని "నారాయణగిరి పాదాలు" అంటూ భక్తులు దర్శిస్తూనే ఉంటారు. ఇదే "నారాయణగిరి" కొండ.

ఇంకొక దివ్యగాథను బ్రహ్మాండపురాణం ఇలా వివరిస్తున్నది.

పూర్వం నారాయణుడనే విప్రుడు వేంకటపర్వతం చేరుకొన్నాడు. స్వామిదర్శనంకోసం తపస్సు చేశాడు. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు ప్రత్యక్షం కాగా ఇలా కోరుకున్నాడు.

"స్వామీ! ఈ భువిలోని మానవులు ఇంద్రియ నిగ్రహంతో తపస్సు చేయడం అసాధ్యం. అందువల్ల వాళ్లమీద అనుగ్రహంతో ఈ కొండపై ప్రత్యక్షంగా నిలిచి దర్శనాన్ని ప్రసాదించు."

**శ్లో ॥ తేషామనుగ్రహార్థాయ సర్వప్రత్యక్షగోచరః**
**సర్వాభీష్టం దదన్నిత్యం స్వామిపుష్కరిణీ తటే**
**అనంతవిహగేశాన సేనాపతి ముఖైః సదా**
**సేవ్యమానః శ్రియా సార్ధం విహరన్ వస మాధవ!**
**గిరిశ్చాయం హి మన్నామ్నా ప్రసిద్ధిమధిగచ్ఛతు**

**- బ్రహ్మాండపురాణం - అధ్యా 3 - శ్లోకం 47,48**

ఆదిశేషుడు, గరుత్మంతుడు, విష్వక్సేనుడు మున్నగువారు సేవిస్తుండగా స్వామిపుష్కరిణీ తీరంలో ప్రత్యక్షంగా కొలువై వుంటూ భక్తులకు ఇష్టార్థాలను ప్రసాదించు. అంతేకాదు స్వామీ! నీవు నిలిచివున్న ఈ కొండ నా పేరుతో **నారాయణాద్రి! నారాయణగిరి! నారాయణాచలం!** అనే పేర్లతో ప్రసిద్ధి పొందునట్లు వరాన్ని దయచేయి. అంటూ ప్రార్థించాడు నారాయణుడనే విప్రుడు. తథాస్తు! అన్నాడు వేంకటాచలపతి.

ఇంచుమించుగా ఇదే గాథను వరాహపురాణం కూడా పెద్దగా వివరించింది.



**శ్లో ॥ ద్విజో నారాయణః కశ్చిత్తపః కృత్వా మహత్పురా**
**ఐచ్ఛదస్య స్వనామ్నా చ వ్యపదేశం మురారితః**
**తస్మా న్నారాయణాద్రిం తం విదురుత్తమపూరుషాః**

**- వరాహపురాణం - 36 అధ్యా - 24, 25 శ్లోకాలు.**

నారాయణుడనే విప్రుడు చాలకాలం తపస్సు చేసి, తన పేరుతో ఈ క్షేత్రం ప్రసిద్ధిని పొందాలన్న కోరిక వల్ల ఈ కొండ **"నారాయణాద్రి"** పేరుతో పిలువబడుతున్నది.

మాతృశ్రీతరిగొండవెంగమాంబ తన వేంకటాచలమాహాత్మ్యం పద్యకావ్యంలో **'నారాయణాద్రి'**ని గూర్చి ఇలా పేర్కొనింది.

**క. నారాయణుఁడను విప్రుం**
**దారూఢిగఁ దపము సేసి హరి మెప్పించెన్**
**ధారుణిఁదత్కారణమున**
**నారయ నారాయణాద్రి యన ఘనమయ్యెన్**

**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం ఆశ్వా-1. పద్యం-112**

శ్రీ నారాయణాద్రీశ! గోవిందా! శ్రీ నారాయణాచలపతే! గోవిందా! అనే నామాలనూ స్మరిస్తూ ఈ పర్వతాన్ని ఎక్కితే చాలు! సమస్త కోరికలు సిద్ధించడమే గాక పునరావృత్తి రహిత కైవల్యం సిద్ధిస్తుంది!

* * *

## గరుడాచలం

ఏడు కొండలలో నాల్గవది **గరుడాచలం!** అదే **గరుడాద్రి!**

గరుడాచలం అనే పేరు ఎలా ఏర్పడిందో తెలుసా!

ఒకప్పుడు 'హిరణ్యాక్షుడు' అనే రాక్షసుడు వుండేవాడు. రాక్షసుడు కదా! అందుకు తగినట్లుగా లోకాల్ని అనేక విధాలుగా రాక్షసంగా హింసించాడు. ఈ బాధలు ఓర్చుకోలేక లోకులందరూ శ్రీహరిదగ్గరకు వెళ్లి తమ బాధల్ని వెళ్లబోసుకున్నారు. రక్షించమని ప్రాధేయపడ్డారు. అన్నీ విన్న విష్ణువు సరే! నన్నట్లుగా తల ఊపాడు.

హిరణ్యాక్షుడి ప్రవర్తన మరీ మితిమీరిపోయింది. ఏకంగా భూమండాలన్ని చుట్టగా మడతబెట్టి పాతాళ లోకానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆ భూగోళాన్ని కాళ్లతో తన్నుతూ నానారభసా చేశాడు. వీని ఆగడాల్ని భరించ లేక, సహించలేక భూదేవి కూడ వైకుంఠపతిని వేడుకొంది. ఈ కష్టం నుంచి తనను గట్టెక్కించవలసిందని అనేక విధాలుగా ప్రార్థించింది.

హిరణ్యాక్షుని దురాగతాలు ఇంకా మితిమీరకుండా మహావిష్ణువు భయంకరమైన ఉగ్రవరాహంగా అవతరించాడు. శ్వేతవరాహరూపంతో ఆవిర్భవించి వాడిగా వున్న కోరలతో హిరణ్యాక్షుణ్ణి సంహరించాడు. అదే కోరలపై భూమిని ఉద్ధరించి రక్షించాడు.

ఆ ఘనకార్యానికి బ్రహ్మాది దేవతలు, కిన్నర కింపురుష గంధర్వులు, మహర్షులు, యోగులు ఎందరో హర్షిస్తూ ఆదివరాహస్వామిని స్తుతించారు. కీర్తించారు. భూదేవిని రక్షించిన వరాహరూపంతోనే ఇక్కడ వెలసివుంటూ భక్తులను అనుగ్రహించవలసిందంటా ప్రార్థించారు.

సరే! నంటూ తల ఊపిన వరాహమూర్తి గరుత్మంతుని పిలిచాడు.

**శ్లో ॥ వైనతేయ! మహాసత్త్వ గచ్ఛ త్వమతి వేగతః**
**గత్వా తు పరమం ధామ క్రీడాచలమిహానయ**
**... ... ...**
**అప్రాకృతమప్రమేయం చ సర్వరత్నమయం గిరిమ్**



**హిరణ్మయం మహాశృంగం పంచోపనిషదాత్మకమ్**
**... ... ...**
**ఆగతం గరుడం వీక్ష్య స్థాపయేహ ఖగేశ్వర!**
**ఇత్యువాచ హరిస్సోఽపి స్థాపయమాస తం తథా.**

**– వరాహపురాణం. ప్రథమభాగం అధ్యా – 34 శ్లో.-5-22**

"గరుత్మంతా! నీవు వైకుంఠానికి వెళ్లు. అక్కడ నేను శ్రీమహాలక్ష్మితో విహరిస్తూ క్రీడించిన క్రీడాద్రి పర్వతాన్ని, క్రీడావాపి అనే సరస్సుతో కూడా తెచ్చి ఇదిగో ఇక్కడ స్థాపించుమని వరాహస్వామి ఆదేశించాడు.

వెంటనే గరుడభగవానుడు "చిత్తం స్వామీ! చిత్తం. అంటూ రివ్వున వైకుంఠానికి వెళ్లాడు. అక్కడ అప్రాకృతమై అప్రమేయమై నవరత్న శోభితంగా, బంగారు వర్ణంతో ప్రకాశిస్తున్న శిఖరాలు కలిగిన క్రీడాద్రిని చూచాడు. అది పంచ ఉపనిషదాత్మకంగా వెలుగొందుతోంది. వేంటనే ఆ క్రీడాద్రిని అచటి సరస్సుతో కూడా భువికి తీసుకొని వచ్చి ఇక్కడ స్థాపించాడు. అదే **గరుడాద్రి!** సాక్షాత్తు వేదస్వరూపుడైన గరుత్మంతుడు దీన్ని తెచ్చినందువల్ల ఇది **"గరుడాచలం"** గా ప్రసిద్ధి పొందింది.

ఇదే గాథను మాతృశ్రీ తరిగొండవెంగమాంబ తన వేంకటాచల మాహాత్మ్యగ్రంథంలో ఇలా వర్ణించింది.

**క. గురుతర వైకుంఠంబునం**
**దిరవుగ నున్నట్టి దాని నీ భూస్థలికిన్**
**గరుటామంతుఁడు దెచ్చుట**
**నరుదుగ గరుడాద్రియనఁగ విలసిల్లెన్**

**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం ఆశ్వా-1. పద్యం-122**

శ్రీ గరుడాచల నివాసా! గోవిందా! శ్రీ గరుడాద్రీశ! గోవిందా! అంటూ స్మరిస్తూ ఈ పర్వతాన్ని ఎవరైతే ఎక్కుతారో వారికి సర్వభయాలుగాని, సర్వదోషాలు గాని వుండవు.

* * *

## వృషాచలం

ఇక ఐదవ కొండ **వృషాచలం!** లేదా **వృషాద్రి!** వృషం అనగా ధర్మం!

ఒకప్పుడు ధర్మదేవత తిరుమలేశుని గూర్చి తీవ్రంగా తపస్సు చేసిందట! ఏమని? అంటే, తన ధర్మాన్ని తాను నిష్పక్షపాతంగా నడచుకొనేట్లు తద్వారా అభివృద్ధి కలగాలని శ్రీనివాసుని కోరిందట!

**శ్లో ॥ గిరావస్మిన్ తపస్తేపే ధర్మోఽపి స్వాభివృద్ధయే**
**తస్మాదాహు ర్వృషాద్రిం తం మునయో వేదపారగాః**

**– భవిష్యోత్తర పురాణం. భాగ 1.అధ్యా 36 – శ్లో 23**

శ్రీనివాసు డిచ్చిన వరంవల్ల ధర్మదేవత కోరిక నెరవేరింది. అలాగ వృషం తపమాచరించిన స్థలం కనుక **"వృషాద్రి" "వృషాచలం"** అని పేర్లు కలిగాయి.

**ఆ. అధిక ధర్మములకు నాటపట్టయి ధర్మ**
**సిద్ధిఁ బ్రజకుఁ గలుగఁ జేయుచుండు**
**నందుచే వృషాద్రి యను నామధేయంబు**
**దాని కొప్పుచుండు ధరణిమీఁద**

**–శ్రీ వేంకటాచలమాహాత్మ్యం.ఆశ్వా–1, పద్యం–124.**



అంటూ మాతృశ్రీ తరిగొండవెంగమాంబ తన వేంకటాచల మాహాత్మ్యకావ్యంలో చక్కగా వర్ణించింది.

ఓం వృషాద్రీశ! గోవిందా! ఓం వృషాచలపతి గోవిందా!! అని స్మరిస్తూ ఈ పర్వతారోహణ చేస్తే చాలు. ధర్మబుద్ధి అలవడుతుంది. తద్వారా ఔన్నత్యం సిద్ధిస్తుంది.

## వృషభాచలం

**వృషభాద్రి** ఆరవ కొండ! అదే **వృషభాచలం!**

ఈ కొండకు ఈ పేరు ఏర్పడడానికి చక్కటి కథలు, ఆసక్తికరమైన కథలు రెండు వినపడుతున్నాయి.

అందులో ఇది ఒకటి! బ్రహ్మాండ పురాణంలో చెప్పబడిన కమ్మనైన కథ!

పూర్వం వేంకటాచలంపై దక్షిణభాగంలో వృషభాసురుడు అనే రాక్షసుడు వుండేవాడు. వాడు పరమశివభక్తుడు, వాడు ఎంతటి శివభక్తుడో అంతటి దుష్టుడు, క్రూరుడు. భక్తుల కోరికపై వాణ్ణి సంహరించడానికి శ్రీహరి కిరాతవేషాన్ని ధరించాడు. అంతే ఇద్దరూ ఘోరంగా తలపడ్డారు. చివరకు శ్రీనివాసుడు వాడిపై సుదర్శన చక్రాయుధాన్ని ప్రయోగించాడు. ఆ సుదర్శనచక్ర మహా ఆయుధంతో తనకు చావు తప్పదని తెలుసుకున్న వృషభుడు, శ్రీనివాసుని పాదపద్మాలమీద సాష్టాంగపడుతూ శరణు వేడినాడు.

**శ్లో ॥ దేవ దేవ! జగన్నాథ సర్వలోకైకకారణమ్**
**శరణం త్వామనుప్రాప్తః ప్రణతార్తిహర! ప్రభో!**

... ... ...

**అద్య ప్రభృతి చాయం వై గిరిరుచ్ఛ్రితశేఖరః**
**మదాఖ్యాయా ప్రథాం యాతు 'వృషభాచల' ఇత్యపి**
**ఇత్యేవం శోకసంతప్త మశ్రుపూర్ణాకులేక్షణమ్.**

**– బ్రహ్మాండపురాణం. అధ్యా 4. శ్లో. 35–44**

స్వామీ! శ్రీనివాసా! నన్ను సంపూర్తిగా క్షమించు స్వామీ! నీ చేతిలోని సుదర్శనచక్రంతో వధింపబడడం నా పూర్వజన్మల సుకృతంగా భావిస్తున్నాను. చివరిగా నా కోరికను తప్పక తీర్చగల కొండలంతటి కరుణామూర్తివి. దయాంతరంగుడవు. స్వామీ! శ్రీనివాసా! ఇదిగో నేను తిరిగిన ఈ పర్వతప్రాంతం నా పేరుమీద వృషభాచలంగా పేరు పొందాలి. అలాగే ఈ కొండపై నీవు చిరస్థాయిగా నిలిచివుంటూ **"వృషభాద్రిపతి"**గా పేరొంది భక్తులను సంరక్షించు అంటూ వేయి విధాలుగా కళ్లనీళ్లతో ప్రార్థించాడు. శ్రీనివాసప్రభువు తథాస్తు! అన్నాడు

**శ్లో ॥ వృషభాసుర! మద్భక్త్యా విముక్తిం యాస్యసి ధ్రువమ్**
**గిరిశ్చాయం భవన్నామ్నా ప్రసిద్ధిమధిగచ్ఛతు**

**– బ్రహ్మాండపురాణం–అధ్యా–4–శ్లో –45**

అంటూ తన చక్రంతో వాణ్ణి సంహరించినాడు. అప్పటినుండి, ఆనాటినుండి ఇది **'వృషభాచలం'** అయ్యింది. ఇది బ్రహ్మాండ పురాణంలో చెప్పబడిన ఈ గాథ తిరుమల **"చక్రతీర్థం"** లో జరిగిందని భావించవచ్చు.

ఇక దీనికి సంబంధించిన రెండవగాథ. చదవండి!

ఈ వృషభాచలం నామానికి సంబంధించిన ఇంకొక చక్కని స్థలపురాణం, ఇంపైన ఐతిహ్యం వుంది. కాలాంతరంలో మరొక సమయంలో జరిగిన దివ్యగాథ! ఇది భవిష్యోత్తర పురాణంలో ఉట్టంకింపబడింది.



ఈ పర్వతంపైన తుంబురుతీర్థంలో పూర్వం వృషభాసురుడు అనే పేరుతో ఒక రక్కసుడుండేవాడు. వాడు రాక్షసుడైనా తీవ్రమైన నరసింహస్వామి భక్తుడిగా వుండేవాడు. అయితే వాడు ఎంతటి వీరభక్తుడో అంతటి మహాక్రూరుడు. తన కంటపడిన మునులను, యోగులను, స్త్రీలను, మానవులను వెంటబడి వెంటబడి తరుముతూ, హింసించి చంపేవాడు. వాని ఆగడాలకు దుశ్చర్యలకు తాళలేక అందరూ వెళ్లి శ్రీనివాసుణ్ణి వేడికొన్నారు. మహాప్రభో! వాని బారినుండి రక్షించమని అనేకవిధాలుగా స్తుతించారు.

ఈ వృషభాసురుడు ఎంతటి క్రూరుడైనా, ఆరాధన సమయంలో పరమ సాత్వికుడిగా వుండేవాడు. ప్రతిరోజు శ్రీ నృసింహస్వామిని గూర్చి యాగం చేసేవాడు. ఆ యాగంలో చిట్టచివరగా, పూర్ణాహుతిగా తన శిరస్సును వధించి సమర్పించుకొనేవాడు. అదేమి చిత్రమో కాని, ఆ శిరస్సు ఎప్పటిలాగే వాని మొండెంపై మొలిచేది. ఇలా ఒకవైపు వీడి హోమాలు, మరోవైపు ఆగడాలు మితిమీరిపోయాయి.

భక్తులందరి కోరికపై ఒకప్పుడు శ్రీనివాసుడు వునపళంగా వానిముందర ప్రత్యక్షమై దర్శనమిచ్చాడు. శ్రీనివాసుణ్ణి చూస్తూ వెంటనే విస్మయం నుండి తేరుకొని స్వామీ! శ్రీనివాస ప్రభూ! నీవు 'కోరిన వరాలరాయడివి' కదా! నా కొకవరం ఇవ్వు. నాతో యుద్ధం చెయ్యి. ఇదే నాకు నీవు తీర్చవలసిన కోరిక! అని చేతులెత్తి నమస్కరించినాడు.

వేంకటేశ్వరుడు వానితో యుద్ధానికి తలపడినాడు. హోరాహోరిగా జరుగుతున్న యుద్ధంలో చివరకు శ్రీనివాసుడు తన చక్రాయుధాన్ని ప్రయోగించి వాని శిరసును ఖండించబోగా వెంటనే వాడు స్వామీ! చిట్టచివరిగా నాదొక కోరిక. అంటూ ఇలా ప్రార్థించాడు.

శ్లో ॥ "చక్రపాణే! నమస్తుభ్యం చక్రస్య చరితం శ్రుతమ్
మచ్చక్రేణ ప్రతప్తస్తు ముక్తిమేతి న సంశయః
యచ్చక్రేణ పురా రాజా కీర్తిమాన్ కీర్తిమాప్తవాన్
త్వచ్చక్రేణ హతో రాజన్ గచ్ఛామి తవ మందిరమ్
ఏవముక్త్వా హరేః పాదౌ పస్పర్శ వృషభాసురః
వరం యయాచే వృషభః "శైలో మదభిదోఽస్త్వి"తి
సమాలింగ్య 'భవే దేవ' మిత్యుక్త్వా హరిణాథ సః
విసృష్టచక్రసంఛిన్నః త్యక్తవాన్ స కళేబరమ్
తస్మాద్వృషభ శైలోఽయం కృతే ఖ్యాతి ముపేయిమాన్!

**- భవిష్యోత్తర పురాణం - ప్ర. అధ్యా - శ్లో॥ 62 -65**

ఈ పర్వతం నా పేరుతో ప్రసిద్ధమగుగాక! అలాగే నేను ఆ పేరుతోనే పిలువబడాలంటూ ఆ సుదర్శనచక్రానికి బలి అయ్యాడు రాక్షసుడైన వృషభుడు!

ఇది కృతయుగంలో జరిగినట్లుగా పేర్కొనబడిన ఈ గాథ తిరుమల "తుంబురు తీర్థం" లో జరిగింది.

ఇంచుమించుగా ఈ గాథను మహాకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ తన వేంకటాచలమాహాత్మ్య పద్యకావ్యంలో ఇలావర్ణించింది.

**క. మును వృషభాసురుఁ డనియెడి
యనిమిషకంటకుఁడు దానియందుండి తపం
బొనరించిన కారణమున
ననఘా! వృషభాద్రి పేర నవనిన్ వెలసెన్.**

**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం-ఆశ్వా-1 పద్యం-110.**



అలా ఈ పర్వతం **'వృషభాచలం'** అనీ **'వృషభాద్రి'** అని పిలువబడింది. ఆ కొండపైవున్న శ్రీ వేంకటేశ్వరుడు, ఆనాటినుంచి **'వృషభాచలపతి'**గా **'వృషభాద్రీశ్వరుడు'** గా పిలువబడుతూ ఆ యా యుగాలలోని భక్తుల దివ్యగాథలను స్మరింపజేస్తూ వున్నాడు.

ఓం శ్రీవృషభాచలపతి గోవిందా! అంటూ స్మరిస్తూ తిరుమల కొండను ఎక్కిన భక్తులకు శత్రుభయం తొలగుతుంది. శాంతి చేకూరుతుంది.

* * *

## అంజనాచలం

**'అంజనాచలం'** ఏడవకొండ! ఈ పేరు ఏర్పడడానికి అద్భుతమైన దివ్యగాథ ఒకటి వినపడుతున్నది.ఇది బ్రహ్మాండ పురాణంలో చెప్పడింది.

ఇది త్రేతాయుగం నాటికి సంబంధించిన ఆశ్చర్యకరమైన గాథ!

పూర్వం 'కేసరి' అనే వానరరాజు వుండినాడు. ఆయన భార్య అంజనాదేవి. ఎంత కాలానికి సంతానం కలగనందువల్ల ఆమె 'మతంగముని' దగ్గరికి వెళ్ళి తన బాధను వెళ్లబోసుకుంది. మతంగుడు చాలా ఆలోచించి చివరిగా అంజనాదేవికి సంతానం కలిగే మార్గం ఇలా బోధించాడు.

'అమ్మా! పంపానదికి తూర్పుదిక్కున ఐదువందల యోజనాల దూరంలో నరసింహస్వామిక్షేత్రం వుంది. దానికి దక్షిణాన **'నారాయణగిరి'** అనే మహిమాన్వితమైన దివ్యక్షేత్రం ఉంది. అక్కడ ఆ క్షేత్రంలో సకలపాపహారిణి అయిన 'స్వామిపుష్కరిణి' అనే దివ్యమైన భవ్యమైన కోనేరు వుంది. ఆ కోనేటికి ఉత్తరం దిక్కున ఒక క్రోశం దూరాన **'ఆకాశగంగ'** అనే పవిత్రమైన పుణ్యతీర్థం నెలకొని ఉంది. అందులో ప్రతిదినం స్నానం చేస్తూ

పన్నెండేళ్లపాటు తపస్సు చేస్తూ వుండు. నీకు తప్పక సంతానం కలుగుతుంది. గుణవంతుడు, శ్రేష్ఠుడు, అనంత బలశాలి, సర్వలోకపూజ్యుడు అయిన పుత్రుడు నీకు కలుగుతాడు అని ఆశీర్వదించి పంపాడు.

మతంగముని ఆదేశానుసారం అంజనాదేవి వేంకటాచలక్షేత్రాన్ని చేరుకొని 'శ్రీస్వామి పుష్కరిణి'లో స్నానం చేసింది. ఆ పుష్కరిణీ ఒడ్డునవున్న అశ్వత్థ వృక్షానికి ప్రదక్షిణం చేసి, ఆ పక్కనేవున్న శ్రీ ఆదివరాహస్వామివారిని దర్శించింది. పిదప 'ఆకాశగంగ' తీర్థానికి వెళ్లి అక్కడ ఉపవాసదీక్షతో ఒక ఏడాదిపాటు వ్రతమాచరించింది. తపస్సు చేసింది. ఆ తర్వాత వాయుదేవుడు ప్రతిరోజూ ఒక దివ్యఫలాన్ని అంజనాదేవి చేతిలో ప్రసాదిస్తుండగా, దాన్ని ఆమె ఆరగిస్తూ తన తపస్సును కొనసాగించింది. ఈ తపస్సు వల్ల ఆమె పాపాలు తొలగిపోయాయి. ఒక తేజస్సు ఆమెను ఆవరించింది. ఇంతలో ఒకానొకరోజు వాయుదేవుడు తన వీర్యంతో నిండిన ఫలాన్ని ఆమెకు ప్రసాదించాడు. ఆమె యథాక్రమంగా ప్రతిరోజు మాదిరే పండుగా భావించి భుజించగా ఆమె గర్భవతి అయ్యింది. పదిమాసాల తర్వాత ఒక పుత్రుడు కలిగాడు.

**శ్లో ॥ శ్రావణే మాసి నక్షత్రే శ్రవణే హరివాసరే**
**కుండలోద్భాసి గండాంత ముపవీతి సముజ్జ్వలమ్**
**కౌపీనోద్భాసితం చైవ దీప్యమానమివ శ్రియా**
**బిభ్రాణం వానరాణాం వై రూపమత్యద్భుతం మహత్**

**- బ్రహ్మాండపురాణం - అధ్యా - 5. శ్లో.43-44**

శ్రావణమాసంలో శ్రవణానక్షత్రం కూడిన ఏకాదశినాడు ఆంజనేయుడు అవతరించాడు. కుండలాల కాంతితో ఆయన చెక్కిళ్లు మెరుస్తున్నాయట!!



యజ్ఞోపవీతాన్ని ధరించాడు. కౌపీనధారియై శోభాయమానంగా ప్రకాశిస్తూ అత్యద్భుతమైన రూపంతో వానర శ్రేష్ఠుడైన ఆంజనేయుడు జన్మించాడని బ్రహ్మాండ పురాణం పేర్కొంటోంది. అతడే **'ఆంజనేయుడు', 'హనుమంతుడు' 'వాయుపుత్రుడు'** అనే పేర్లతో జగత్ప్రసిద్ధుడయ్యాడు.

ఇదే కథను ఇంచుమించుగా వరాహపురాణం కూడా పేర్కొంటోంది.

**శ్లో ॥ "అంజనా చ తపః కృత్వా హనూమంతమజీజనత్!**
**తదా దేవాః సమాగత్య దేవసాహాయ్యకారకమ్**
**యస్మాత్పుత్రమసూతా సౌ జగుస్తస్మాదిమం గిరిమ్**
**అంజనాద్రి.......................................**

**- వరాహపురాణం-భాగం-1,అధ్యా-36,శ్లో-28-29**

**అంజనావ్రతమాస్థాయ పుత్రం ప్రాప గిరీశ్వరే**
**తస్మాదంజనశైలోఽ యం లోకే విఖ్యాతకీర్తిమాన్"**

**- భవిష్యోత్తరపురాణం- అధ్యా-1-శ్లో. -81**

ఇదే కథను భక్త కవియోగిని అయిన మాతృశ్రీ తరిగొండవెంగమాంబ కూడ తన కావ్యంలో ఇలా తెల్పింది.

**తే. అంజనాదేవి తపము మున్నచటఁ జేసి**
**పొసఁగ హనుమంతుఁడను వరపుత్రుఁగాంచె;**
**నపుడు దేవతలెల్ల సహాయు లగుచు**
**నా గిరికి నంజనాద్రి పే రమర నిడిరి.**

**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం-ఆశ్వా-1,పద్యం-115.**

''అంజనాద్రి''గా పేరొందిన ఈ క్షేత్రమహిమను తాళ్లపాక అన్నమాచార్యులు

**సర్వదేవతలు మృగజాతులై చరించే కొండ !**
**నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ !**
**పుర్వి దపసులే తరువులై నిలిచిన కొండ !**
**పూర్వపు టంజనాద్రి యీ పొడవాటి కొండ !!**

అంటూ చక్కగా కీర్తించినాడు.

ఆంజనేయుడు చిరంజీవిగా అవతరించిన కొండ కనుక **'అంజనాచలం'** అనీ, **'అంజనాద్రి'** అనీ ఈ కొండకు పేర్లు కలిగాయి. అలాగే శ్రీనివాసునికి **'అంజనాద్రీశ్వరుడు' 'అంజనాచలపతి'**, అనే పేరు సార్థకమయ్యింది. ఆంజనేయస్వామి అవతార వృత్తాంతం తిరుమల **'ఆకాశగంగ'** పుణ్యతీర్థ స్థలంలో జరిగింది.

* * *

ఇలాగ తిరుమలకొండకు ప్రసిద్ధం ఐన ఏడు పేర్లు ఆ యా కాలాల్లో, ఆ యా భక్తుల పేర్లతో ఏర్పడ్డాయి. అందువల్లే వేంకటేశ్వరస్వామి **"ఏడు కొండలవాడు"** అనీ **"సప్త గిరీశుడు"** అనీ పిలుబడుతున్నాడు.

ఈ కొండకు ఈ ఏడు పేర్లు మాత్రమే ఉన్నాయనుకోవడం, ఈ పర్వత శిఖరాల్లో కేవలం ఏడుకొండలు మాత్రమే ఉన్నాయనుకోవడం ఏమాత్రం సబబు కాదు. ఆ యా యుగాల్లో కొందరు భక్తుల దివ్యగాథలను, శ్రీనివాస భగవానుని లీలలను స్మరింపజేస్తున్న ఘట్టాలను బట్టి ఏర్పడిన పేర్లు మాత్రమే ఇవి. ఈ ఏడుకొండల పేర్లతో మాత్రమే గాక శ్రీ వేంకట పర్వతం ఇంకా అనేకానేకమయిన సార్థకమయిన పేర్లతో పిలువబడుతూనే ఉంది.

* * *



## నాలుగు యుగాల్లో నాలుగు పేర్లు!

ఈ వేంకటపు కొండ ఒక్కొక్క యుగంలో ఒక్కొక్క పేరుతో జగత్ప్రసిద్ధిని పొందింది.

శ్లో॥ **కృతే వృషాద్రిం వక్ష్యంతి**
**త్రేతాయాం అంజనాచలమ్**
**ద్వాపరే శేషశైలేతి**
**కలౌ శ్రీ వేంకటాచలమ్**
**నామాని యుగభేదేన**
**శైలస్యాస్య భవంతి హి**

ఈ దివ్య క్షేత్రం కృతయుగంలో **'వృషాద్రి'** అనీ, త్రేతాయుగంలో **'అంజనాద్రి'** అనీ, ద్వాపరయుగంలో **'శేషశైలం'** అని, పిలువబడింది. ఇక ఈ కలియుగంలో **'వేంకటాద్రి'** అనే పేరుతో ప్రసిద్ధమై దివ్య మహిమలతో అలరారుతూ వున్నది. ఇలా అనేక యుగాల్లో అనేక పేర్లతో భాసించే దివ్యస్థలం **'వేంకటాచలం'**.

ఈ పుణ్యస్థలం, ఎన్నెన్నో మహాపాతకాలను ఘోరమైన దోషాలను దహించి వేస్తుందట! అందుకే **'వేంకటాచలం'** అన్నసార్థకమైన పేరు కలిగి వుంది.

అనాదిగా ఈ క్షేత్రంలోని పర్వతాలు, లోయలు అన్ని వేళల్లో పచ్చని చెట్లతో పూ పొదరిండ్లతో, పవిత్ర పరిమళ ఝురులతో నిండి వుంటాయి. ఎక్కడ చూచినా తామరకొలనులు. ఆ కొలనులపై 'జుం' అంటూ నాదాన్ని చేస్తూ కంటికింపుగా తిరుగాడే నల్లని తుమ్మెదలు. ఆ కొలనుల చుట్టురా

పనస అరటి పండ్ల తోటలు. ఇలా వాతావరణమంతా ప్రకృతి సౌందర్యంతో రమణీయంగా అన్ని ఋతువుల్లో దర్శనమిస్తున్న క్షేత్రం.

జింకలు, దుప్పులు, ఎలుగు బంట్లు, ఇలా జంతు రూపాల్లో. ఎందరో దేవతలు, పరమ యోగులు ఇక్కడ తిరుగుతుంటారు. కూ! కూ! అంటూ, 'కీచ్ కీచ్' అంటూ సహజ సుందరంగా అరుస్తూ నిశ్శబ్దమైన గంభీరమైన అరణ్య వాతావరణాన్ని ఆహ్లాదంగా చేస్తున్న ఎన్నో పక్షి సంతతులు ఆ క్షేత్రంలో అడుగడుగునా కనపడతాయి. అసలు పక్షుల కూతల ధ్వనులు జంతువుల అరుపుల శబ్దాలు వేదమంత్రాల లాగా, స్వామివారిని కీర్తిస్తున్న సంకీర్తనలుగా శ్రుతికింపుగా వినవస్తాయి. ఈ పర్వతంలోని గుహలు సకల సంపదలకు ఆలవాలం అయిన నిధులు! ఈ పర్వతంలో ఎక్కడ చూచినా కనపడే చిన్నవీ, పెద్దవీ, అయిన రాళ్లు, రప్పలు, గుట్టలు, అన్నీ రత్నాల రాసులు, చింతామణులు!

## అనేక కల్పాల్లో అనేక పేర్లు

**శ్లో ॥ బహూని చాస్య నామాని కల్పభేదాద్భవంతి హి**
**యావదుక్తా భగవతః కల్యాణగుణరాశయః**
**తావంతోऽస్య గిరేస్సంతి గుణాః పరమపావనాః**
**అస్య వేంకటశైలస్య మాహాత్మ్యం యావదస్తి హి**
**తావద్వక్తుం చ కార్త్స్న్యేన న సమర్థశ్చతుర్ముఖః**
**షణ్ముఖశ్చ సహస్రాస్యః ఫణీ దేవాః పరే కిము?**

అనంతకోటి బ్రహ్మాండనాయకుడు శ్రీవేంకటేశుడు. ఆ భగవానుని కల్యాణ గుణాలు అనంతం. అలాగే ఈ వేంకటాచల క్షేత్రం నామాలు, మహిమలు కూడా అనంతం. ప్రతికల్పంలోను అవి అసంఖ్యాకంగానే



పెరుగుతున్నాయి. వాటిని పేర్కొనడం, వల్లించడం నాలుగుమొగాలబ్రహ్మకు గాని, ఆరుమొగాల సుబ్రహ్మణ్యునికి గాని, వేయి నాలుకలున్న ఆదిశేషునికి గాని సాధ్యం కానే కాదు.

## బంగారు పర్వతం-కనకాద్రి

పూర్వం ఒకప్పుడు మేరు పర్వతం బ్రహ్మదేవుని గూర్చి తపస్సు చేసిందట. నా పేరు భూలోకంలో శాశ్వతంగా నిలిచి వుండాలని ప్రార్థించిందట.

బ్రహ్మదేవుడు 'సరే'నని నవరత్నాలను, కల్పవృక్షాలను, నారులుగా పోయడమే గాక, దీన్ని బ్రహ్మాండ భాండాలకు, ఆధారంగా చేశాడు. ఆనాటి నుండి బంగారు కాంతులతో ప్రకాశించే కొండ కనుక **'బంగారుకొండ'** అనీ, **'కనకాద్రి'** అని ఈ క్షేత్రం పేరు పొందింది.

ఇలాంటి అద్భుతమైన పరమపావనమైన ఈ దివ్య స్థలంలో ఒకచోట బ్రహ్మాది దేవతలు ఇంకోచోట పరమభక్తులైన ఋషులు మునులు, సూర్య చంద్రాది నవగ్రహాలు తపస్సు చేస్తుంటారట! అంతేకాదు. చతుర్వేదాలు, నదీ, నదాలు, పర్వతాలు, సకల తీర్థాలు శరీరాలను ధరించి, నిరంతరం ఈ క్షేత్ర అధి దైవమైన శ్రీమన్నారాయణున్ని గూర్చి తదేకంగా తపస్సులు చేస్తుంటాయి. వీళ్లంతా తమ తమ కోరికలను తీర్చుకోవడంతో పాటు లోక కల్యాణం కోసం తపస్సుల్ని ధారపోస్తారట!

**శ్లో॥ "అప్రాకృతమమేయం చ సర్వరత్నమయం గిరిమ్**
**హిరణ్మయం మహాశృంగం! పంచోపనిషదాత్మకమ్**
**శాతకుంభస్వరూపత్వాత్ కనకాద్రిం చ తం విదుః**
**- వరాహపురాణం-భాగ-1-అధ్యా 3- శ్లో 11,24**

అప్రాకృతమైన అమేయమైన ఈ కొండ సర్వరత్నాలతో నిండి వుందట! ఈ కొండ శిఖరాలు అన్నీ బంగారు మయమట! ఉపనిషత్తుల మయమైన ఈ కొండే కనకాద్రి!

ఆ పర్వత సానువుల్లో కొలనుల ఒడ్డున కోనేర్ల పక్కన ప్రశాంతమైన ఉషోదయవేళల్లో శుకయోగి, బ్రహ్మదేవుడు, ఇలా ఎందరెందరో శ్రుతులను చక్కగా గానం చేస్తుండగా, అక్కడి చెట్ల మీది రామచిలకలు, వారి గానంతో శ్రుతి కలుపుతూ కూస్తుండగా ఆ పర్వత సానువులు మనోహరమైన శ్రుతి కింపైన ధ్వనులతో మార్మోగుతుంటాయి. ప్రాతః సంధ్యా సమయాల్లో చెట్ల గుబురుల్లో దోబూచులాడే మంచు పొరలు హోమధూమాల్లాగా కనపడుతూ ఆ వాతావరణాన్ని మరింత ఆహ్లాదపరుస్తుంటాయి.

ఈ పర్వతంపై నెమళ్లు ఎక్కువగానే కనపడతాయి. అవి 'తకధిమ్మని' నాట్యం చేస్తూండగా, దేవకన్యలు కూడ నృత్యం చేస్తూ స్వామికి నృత్యారాధన చేస్తుంటారు. కొన్నిచోట్ల కోయిలలు, గోరువంకలు పురాణాలు చెప్తుండగా వింటుంటూరు. గజరాజులు ఘీంకరిస్తూ చేసే 'ఓం' కారం నాదాలు పర్వతసానువుల్లో మార్మోగుతూ శ్రుతికింపుగా మనోహరంగా వినవస్తుంటాయి. ఇలా ఎక్కడ చూచినా, విన్నా సుస్వరమైన వేదనాదాలు, పదమంజీర నృత్య రవళులూ యజ్ఞయాగాదులు... ఇలా సర్వే సర్వత్ర సర్వకళలకు, సర్వవిద్యలకు నిలయంగా భాసిస్తుంటుంది ఈ **కనకాచలం!**

**క. అనిమిషులు ముదంబునఁ గనుఁ-**
**గొనఁదగి తద్గిరిని శాతకుంభము లుండున్**
**గనుక మహాశోభితమై**
**కనకాచల మనెడు పేర ఘనతర మయ్యెన్**
**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం-ఆశ్వా-1.పద్యం-111.**



మహాశోభాయమానంగా ప్రకాశిస్తూవున్న ఈ క్షేత్రరాజం **'కనకాచలం'** అని పేరొందినట్లు భక్తకవయిత్రి మాతృశ్రీతరిగొండ వెంగమాంబ శ్రీవేంకటాచలమాహాత్మ్యంలో చక్కగా వర్ణించింది.

* * *

## వరాహాచలం

హిరణ్యాక్షుడనే రాక్షసుణ్ణి వధించి, భూదేవిని రక్షించడానికై శ్రీమన్నారాయణుడు శ్వేతవరాహావతారమెత్తాడు. ఆ తర్వాత ఈ భూలోకంలో ఈ కొండపై శేత్వవరాహమూర్తిగా వెలసి వున్నందున.

**"వరాహాద్రి వరాహక్షేత్ర లక్ష్మతః"**

ఇదే వృత్తాంతాన్ని మాతృశ్రీ తరిగొండవెంగమాంబ తాను రచించిన శ్రీవేంకటాచలమాహాత్మ్య గ్రంథంలో ఇలా వర్ణించింది.

**కII మునుపు వరాహసమూహము**
**లనిశము వర్తించుచోట నా హరి కిటియై**
**యనువుగ నిల్చిన కతమున**
**ననఘ వరాహాద్రి పేర నా నగమొప్పెన్**
**-శ్రీ వేంకటాచలమాహాత్మ్యం-ఆశ్వా-1.పద్యం-116.**

అందువల్లే **"ఆదివరాహక్షేత్రం"** అనీ, **"శ్వేతవరాహక్షేత్రం"** అనీ, భూదేవితో నిలిచి వున్నందున **'భూవరాహక్షేత్రం'** అనీ ఈ కొండకు కృతయుగంలో పేర్లు కలిగాయి.

* * *

## క్రీడాద్రి

ఆ సందర్భంలో వరాహస్వామి గరుత్మంతుణ్ణి పిలిచి వైకుంఠానికి వెళ్లి అక్కడవుండే క్రీడాద్రిని, క్రీడావాపితో కలిపి తెచ్చి ఇక్కడ స్థాపించమన్నాడు. గరుత్మంతుడు తెచ్చి స్థాపించిన ఆ కొండే **"క్రీడాద్రి"** అనీ **"క్రీడాచలం"** అని పేరొందిందింది.

అంతేకాక శ్రీనివాసుడు మహాలక్ష్మి, భూదేవులతో కలిసి ఈ పర్వతంపై వేడుకతో క్రీడిస్తూ సంచరిస్తుంటాడని అందువల్లే ఇది "క్రీడాచలం"గా పేర్కొనిందని తరిగొండవెంగమాంబ ఇలా వర్ణించింది.

**క॥ పోడిమిగా సిరి మొదలగు**
**చేడియలను గూడి యచట శ్రీహరి వేడ్కన్**
**గ్రీడించుచు నుండుట నది**
**క్రీడాచలమనఁగ ధరను కీర్తింబొందెన్**

**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం.ఆశ్వా-1.పద్యం-121.**

* * *

## వైకుంఠాద్రి

**శ్లో॥ వైకుంఠా దాగతత్వేన**
**వైకుంఠాద్రి రితి స్మృతః**

శ్రీ వైకుంఠం నుండి గరుత్మంతుడు తెచ్చినందువల్ల **"గరుడాద్రి"** అనీ **"శ్రీ వైకుంఠాద్రి"** అనీ పేర్లు కలిగాయి.

అరణ్యవాస సమయంలో సీతాదేవిని వెదుకుతూ శ్రీరామచంద్రుడు, లక్ష్మణస్వామితోను, వానరులతో కలిసి వేంటాచలక్షేత్రాన్ని సందర్శించాడు.



ఆ సందర్భంలో కొందరు వానరులు కొండలు, కోనలు, వెదకుతూ అక్కడ వున్న ఒక కొండ గుహతో దూరారు. అందులో చాలదూరం వెళ్లారు. అంతే! ఆ వానరులకు అద్భుతమైన దివ్యలోకం దర్శనమిచ్చింది. అక్కడ వున్నవారూ, సంచరిస్తున్న వారూ..., ఇలా ఎవరిని చూచినా, అందరూ శంఖచక్రాలను ధరించివున్నారట. నొసట్లో ఊర్ధ్వపుండ్రాలను ధరించివున్నారు ఇంకా అద్భుతమైన నవరత్నాల పొదిగిన కిరీటాలతో, భుజకీర్తులలో దివ్యాభరణాలతో ప్రకాశిస్తూ ప్రతి ఒక్కరూ సాక్షాత్తు శ్రీమన్నారాయణునిలాగే కనపడ్డారట!

ఇలా వీరందరినీ వింతగా ఆశ్చర్యంగా చూస్తూ ఇంకాలోపలికి పోతున్న వానరులను అక్కడివారు గమనించి బెదరించారట! అంతే! బతుకు జీవుడా! అంటూ ఆ వానరులు వెనకకు పరిగెత్తుతూ కొండగుహ బయటికి వచ్చిపడ్డారు. ఈ ఆశ్చర్యంలోంచి తేరుకొని మళ్లీ ఆ కొండగుహను పరిశీలించగా, కొండమాత్రమే గోచరించింది కాని గుహ అదృశ్యమయింది.

మరింత ఆశ్చర్యపడిన వానరులు తాముదర్శించిన దృశ్యాన్ని శ్రీరామునికి తెలియజేశారు. అప్పుడు ఆయన ఇలా అన్నారు. ఈ క్షేత్రం సాక్షాత్తు వైకుంఠం! అందువల్ల శ్రీమన్నారాయణుడు, వారి సేవకులు సంచరిస్తుంటారు. మీ భాగ్యంవల్ల భూలోక వైకుంఠమయిన ఈ క్షేత్రంలో మీ కీ దర్శనం కలిగిందన్నాడట!

అందువల్లే ఇది సాక్షాత్తు **వైకుంఠాద్రి, వైకుంఠాచలం** పేరుపొందిందని, సాక్షాత్తు శ్రీరాముడు ధృవీకరించినట్లుగా వేంకటాచలమాహాత్మ్యం పేర్కొంటోంది.

మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కూడ ఇది **"వైకుంఠాద్రి"** అని ఇలా పేర్కొనింది.

**క. ఆ వైకుంఠపురంబున**
**బావనమైయుండు దానిఁ బక్షీంద్రుఁడు తేఁ**
**గా వచ్చిన కారణమున**
**శ్రీ వైకుంఠాద్రియనఁ బ్రసిద్ధంబయ్యేన్.**
**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం-ఆశ్వా-1. పద్యం-113.**

* * *

## సుమేరు పర్వతం

**శ్లో॥ మేరు పుత్రం మహాపుణ్యం**
**వేంకటాచలసంజ్ఞకమ్**

మేరుపర్వత పుత్రుడైన ఈ కొండకు **'వేంకటాచలం'** అని పేరు. బంగారు మేరువు లాగానే ఈ తిరువేంకటకొండ కూడ మెరుస్తుంటుందట. అందువల్ల ఈ వేంకటపు కొండకు **"మేరు పర్వతం"** అనే పేరు కూడ ఉన్నది.

## పుష్కరాద్రి

**శ్లో॥ పుష్కరాణాం చ బాహుళ్యాత్**
**గిరావస్మిన్ సరస్సు వై**
**పుష్కరాద్రిం ప్రశంసంతి**
**మునయస్తత్వదర్శినః**
**- వరాహపురాణం - భాగం - 1 అధ్యా - 36 శ్లో.22**

వేంకటాచలంపైన అనేక పుష్కరిణులు ఉన్నాయి. కొన్ని భక్తి ప్రదాలు! కొన్ని జ్ఞాన ప్రదాలు! మరి కొన్ని ముక్తి ప్రదాలు. వీటిలో కొన్ని అగోచరంగా



వున్నాయి. వీటిని దర్శించినా, స్మరించినా స్నానం చేసినా పాపాలు పోతాయి. కోరికలు తీరుతాయి.

**క॥ నిష్కామ తపోధనులకుఁ**
**బుష్కలముగ స్నాన, పాన, పూజ లొనర్పన్**
**పుష్కరిణులు గల వందునఁ**
**బుష్కరశైలం బనంగ భూమిని వెలసెన్**
**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం. ఆశ్వా-1. పద్యం-109.**

ఎలాంటి కోరికలు లేకుండా తపస్సాధన చేస్తున్న మహర్షులకు, యోగులకు భక్తులకు ఈ కొండపైన పుష్కలంగ మహిమాన్వితమైన పుష్కరిణిలు వున్నాయట! అందువల్లే ఇది పుష్కరశైలం అనీ పుష్కరాద్రి అని ప్రసిద్ధి కెక్కిందని మాతృశ్రీ తరిగొండవెంగమాంబ వక్కాణించింది.

* * *

## తీర్థాద్రి

**శ్లో ॥ సర్వతీర్థమయత్వాచ్చ**
**తీర్థాద్రిం ప్రాహురుత్తమాః**
**- వరాహపురాణం-భాగం-1 అధ్యా 36 -శ్లో. 21**

ఇలాంటి పుష్కరాలు వున్నందువల్ల **'పుష్కరాద్రి'** అనీ **'పుష్కరాచలం'** అనీ, అనేక తీర్థాలు ఉన్నందువల్ల **"తీర్థాద్రి"** అనీ, **'తీర్థాచలం'** అనీ ప్రసిద్ధమైన నామాలు ఏర్పడ్డాయి.

**"తీర్థాద్రి"** ని గూర్చి మాతృశ్రీతరిగొండవెంగమాంబ తన శ్రీవేంకటాచల మాహాత్మ్యకావ్యంలో ఇలాపేర్కొంది.

క॥ అర్థముఖములగు కోర్కెల
సార్థకములు సేసి జనుల సంరక్షించే
తీర్థము లందుండుట నది
తీర్థాచలమనెడు పేర దీపితమయ్యెన్

-శ్రీవేంకటాచలమాహాత్మ్యం ఆశ్వా-1.పద్యం-108.

* * *

## సింహాచలం

శ్లో॥ హిరణ్యాఖ్యవినాశాయ
ప్రహ్లాదానుగ్రహాయ చ!
నారసింహాకృతి ర్జజ్ఞే!
యస్మాదస్మాత్స్వయం హరిః
సింహాచల ఇతి ప్రాహుః
తస్మాదేనం మునీశ్వరాః

- వరాహపురాణం భాగం-1-అధ్యా 37-శ్లో.26,27

శ్రీహరి ప్రహ్లాదరక్షకునిగా నారసింహావతారం ఎత్తి హిరణ్యకశిపుణ్ణి సంహరించాడు. అందుకే ఈ కొండ **"సింహాచలం"** అనీ, **"సింహాద్రి"** అనీ పేర్కొనబడింది.

ప్రహ్లాదవరదుడైన శ్రీనరసింహస్వామి ఆవిర్భవించిన దివ్యక్షేత్రం కనుక ఇది **'నరసింహాద్రి'**గా పేరొందిందని భక్తురాలైన తరిగొండవెంగమాంబ ఇలా వర్ణించింది.

క॥ నరసింహుం డా దితిసుతుఁ
నరుదుగ ఖండించి యచట నా ప్రహ్లాదుం
గరుణను బ్రోచిన కతమున
నరసింహగిరీంద్ర మనెడి నామము గల్గెన్

-శ్రీవేంకటాచలమాహాత్మ్యం-ఆశ్వా-1. పద్యం-114

* * *



## చింతామణి పర్వతం

"చింతితస్య చ సిద్ధ్యా తు చింతామణిమిమం విదుః"

- వరాపురాణం భాగం 1-అధ్యా 36-శ్లో.20

ఈ కొండ చింతించిన వారి పాలి అరచేతి "చింతామణి" లాగా భక్తులకు సమస్త కోరికలను తీరుస్తున్నది. అందువల్ల ఇది **"చింతామణి పర్వతం"** అనీ, **"చింతామణి గిరి"** అని ప్రసిద్ధి చెందింది.

అందుకే అన్నమయ్య కూడా "మమ్ము చేవదేర కాచినట్టి చింతామణీ" అని కీర్తిస్తాడు.

మాతృశ్రీ తరిగొండవెంగమాంబ కూడా తాను రచించిన 'శ్రీవేంకటాచల మాహాత్మ్యం' గ్రంథంలో ఇలా వర్ణించింది.

క. చింతించిన యర్థము లిపు
డెంతేని లేదనక జనుల కిచ్చుచునుండున్
సంతోషముగా నిందునఁ
జింతామణి యనెడు పేరు శ్రీగిరి కొప్పెన్

-శ్రీవేంకటాచలమాహాత్మ్యము.ఆశ్వా-1.పద్యం-106..

* * *

## నీలాద్రి

**శ్లో॥ నీలస్య వానరేంద్రస్య, యస్మాన్నిత్యమవస్థితిః**
**తస్మాన్నీలగిరిం నామ్నా వదంత్యేనం మహర్షయః**

పూర్వం 'నీలుడు' అనే ముని తపస్సు చేసి సిద్ధిని పొందినందువల్లా, ఇంకా నీలుడనే వానరుడు తపస్సు చేయడంవల్లా దీనికి **'నీలాద్రి'** అనీ, **'నీలాచలం'** అని ఈ కొండకు పేర్లు కలిగాయి.

ఇదే భావాన్ని తరిగొండవెంగమాంబ ఒక పద్యంలో ఇలావర్ణించింది.

**క॥ మును నీలుండను పేరిటి**
**వనచరుఁ డా శైలమున నివాసము చేసెన్**
**గనుకన్ నీలగిరీంద్రం**
**బనఁగా విఖ్యాతిఁబొందె నది నవనీ స్థలిపై**
**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం ఆశ్వా-1. పద్యం-117.**

* * *

## శ్రీనివాసాద్రి

**శ్లో॥ "ద్విభుజా వ్యూహలక్ష్మీ స్స్యాత్ బద్ధపద్మాసన ప్రియా**
**శ్రీనివాసాంగమధ్యస్థా సుతరాం కేశవప్రియా"**

శ్రీమహాలక్ష్మిని తన వక్షస్థలంపై వ్యూహలక్ష్మిగా ధరించి శ్రీమన్నారాయణుడు "శ్రీనివాసుడు" అనే పేరుతో ఇచట దర్శనమిస్తున్నందువల్ల ఈ కొండ **"శ్రీనివాసాద్రి"** అనీ, **'శ్రీనివాసాచలం'** అని పేరొందింది.

అందువల్లే మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ ఇలా వర్ణించింది.



**క॥ శ్రీకి నివాసంబై, భూ**
**లోకములో మానవులు విలోకింప మహా**
**శ్రీకరుఁడై హరియుండఁగఁ**
**బ్రాకటముగ శ్రీనివాసపర్వత మయ్యెన్**

**-శ్రీ వేంకటాచలమాహాత్మ్యం. ఆశ్వా-1. పద్యం-118.**

బాగుంది! ఆ తల్లి శ్రీమహాలక్ష్మిని వ్యూహలక్ష్మిగా నివాసంగా కలిగివున్నాడు కనుక "శ్రీనివాసు"డయ్యాడు స్వామి. ఆ జగన్మాత ఎక్కడ వుంది? ఎలావుంది? ఏం చేస్తుంటుంది? అంటే?

**శ్లో॥ ఈశానాం జగతోఽస్య వేంకటపతే ర్విష్ణోః పరాం ప్రేయసీం**
**తద్వక్షఃస్థల నిత్యవాసరసికాం తత్క్షాంతి సంవర్ధినీమ్**
**పద్మాలంకృత పాణిపల్లవయుగాం పద్మాసనస్థాం శ్రియం**
**వాత్సల్యాదిగుణోజ్జ్వలాం భగవతీం వందే జగన్మాతరమ్**

ఆ తల్లి వాత్సల్యాదిగుణాలతో ప్రకాశిస్తున్నదట! అంటే అప్పుడే యీనిన ఆవు తన లేగదూడను నాలుకతో నాకుతూ మాలిన్యాన్ని శుభ్రం చేస్తున్నట్లుగా శ్రీవారి వక్షఃస్థలనివాసిని అయిన అలమేలుమంగ-భక్తుల పాపాలను, దోషాలను వాత్సల్యగుణంతో పోగొడుతూ వారిని పవిత్రులను చేసి, వారిని అనుగ్రహించవలసిందని స్వామివారికి విన్నవిస్తుంది. ఆమె మాటను కాదనలేక, స్వామి భక్తులను అనుగ్రహిస్తున్నాడట! వరాలనుగుప్పిస్తున్నాడట! భక్తుల పరిరక్షణలో సర్వథా, సర్వదా వారిరువురి ప్రమేయమూ పాత్రా అనన్యం, అసాధారణం కూడ. అందువల్లే ఆ స్వామి శ్రీనివాసుడయ్యాడు. ఇలా ఇరువురు కలిసివున్న కొండకనుక ఇది **శ్రీనివాసాద్రి!**

* * *

## ఆనందాద్రి

శ్రీవేంకటేశ్వరుడు “ఆనందనిలయం” అనే బంగారు మేడలో వెలసి వుంటూ, తనను దర్శించిన వారందరికీ ఆనందాన్ని ప్రసాదిస్తున్నాడు. అందువల్ల ఈ కొండ **“ఆనందాద్రి”** అనీ, **“ఆనందాచలం”** అనీ పిలువబడుతున్నది.

**క॥ శ్రీ ని నురంబున నిడికొని**
**శ్రీ నారాయణుఁడు ప్రజకు సిరులిచ్చుచు నం**
**దానందించుచు నుండఁగ**
**నానందాచల మనంగ నగ్గిరి యొప్పెన్**

**-శ్రీ వేంకటాచలమాహాత్మ్యం. ఆశ్వా-1. పద్యం-119.**

వక్షఃస్థల మహాలక్ష్మితోకూడిన శ్రీనివాసుడు భక్తులను ఆనందింప జేస్తున్నందువల్లే ఇది **“ఆనందాచలం”** అని **‘ఆనందాద్రి’** అని మాతృశ్రీ తరిగొండవెంగమాంబ కీర్తించింది.

శ్రీనివాసుడు వక్షఃస్థలవ్యూహలక్ష్మితో స్వయంవ్యక్తమూర్తిగా అర్చనలందుకొంటున్న నిలిచివున్న దివ్యస్థలమే ఆనందనిలయం! అందువల్లే స్వామివారికి ‘ఆనందనిలయుడు’ అనే ప్రసిద్ధమైన పేరు కలిగింది. ఆనందనిలయ గర్భాలయంపైన నిర్మించబడిన బంగారు శిఖరమే “ఆనందనిలయ విమానం”. మానం లేనిది. అనగా కొలత లేనిది. కొలువ లేనిది. దేనిలో? అంటే మహిమల్లో అనంతమైనది. ఆనందనిలయాన్ని దర్శిస్తే చాలు. పరమానందం కలుగుతుంది అంతేకాదు. కోరినవారికి కోరిన వరాలు సిద్ధిస్తాయట. అందుకే శ్రీనివాసుని నందకాంశసంభూతుడైన తాళ్లపాక అన్నమాచార్యులు ఇలా కీర్తిస్తున్నాడు.



**“ఇంచుకైన వేంకటేశు గిరిశిఖరము**
**కాంచుటే కలుగవలె గాకా**
**అంచితంబైన నిత్యానంద పదవులును**
**మించి తమ ఎదుట ప్రభవించినవె కావా”**

**– తాళ్లపాక అన్నమాచార్యులు**

అంటూ అన్నమయ్య మరోచోట ఇలా ధృవీకరించి వెలుగెత్తి చాటుతున్నాడు.

**కోరినవారికి కోరిన వరములు**
**నూరంత ప్రోదుల నొసగుచు**
**చేరువయై కృపచేసే నిదివో**
**కూరిమి నా “నడిమి గోపురమేడ”**

**– తాళ్లపాక అన్నమాచార్యులు**

* * *

## వేదాద్రి

ఈ వేంకటాచలం జ్ఞానప్రదాయినియైన **“పంచోపనిషదాత్మకం”** అని పేర్కొనబడింది.

**కట్టెదుర వైకుంఠము కాణాచయినకొండ!**
**తెట్టెలాయ మహిమలే తిరుమలకొండ!**

**వేదములే శిలలై వెలసినదీ కొండ!**
**యే దెస బుణ్యరాసులే యేరులైనదీ కొండ!**
**గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ!**
**శ్రీ దేవుడుండేటి శేషాద్రి ఈ కొండ**

**– తాళ్లపాక అన్నమాచార్యులు**

అన్ని అన్నమయ్య పేర్కొన్న ఈ కొండ సాక్షాత్తు వేదస్వరూపం! అందువల్లే ఇది **"వేదాద్రి" "వేదాచలం"** అనీ పిలువబడుతున్నది. వేదస్వరూపుడైన గరుడుడు తెచ్చినందువల్ల కూడా **"వేదాద్రి"** అని కూడ పేరు పొందింది.

* * *

## జ్ఞానాద్రి

**శ్లో॥ కేచిత్ జ్ఞాన ప్రదత్వాచ్చ**
**జ్ఞానాద్రి రితి తం విదుః**

**- వరాహపురాణం.భాగం-1-అధ్యా 36- శ్లో॥-20**

ఈ శేషాచలం ఎందరో యోగులకు మునులకు దేవతలకు జ్ఞాన ప్రదాయిని అయిన ఉపాసనాస్థలం కనుక ఈ కొండ **"జ్ఞానాద్రి"** అనీ, **"జ్ఞానాచలం"** అనీ ప్రసిద్ధికెక్కింది పేరొందింది.

శ్రీవేంకటేశ్వరుని ఆంతరంగికభక్తురాలు మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ **"జ్ఞానాద్రి"**ని ఇలా వర్ణించింది.

**క. జ్ఞానం బించుకఁ గల్గిన**
**మానవు లందుండిరేని మఱి మఱి జ్ఞానం**
**బానాఁట వృద్ధిఁ బొందును**
**దానన్ జ్ఞానాద్రియనఁగ ధరపై నొప్పెన్**

**-శ్రీ.వేం.మా.ఆశ్వా-1,పద్యం-107**

జ్ఞానాద్రిగా ప్రశస్తినందిన వేంకటాచలక్షేత్రాన్ని సందర్శించడానికి ఒకప్పుడు సప్తర్షులు వచ్చారు.



## సప్తర్షి కృత శ్రీవేంకటేశస్తోత్రం

భక్తిజ్ఞాన వైరాగ్య సంపన్నులైన ఈ రుషులు అందరూ ఏడుకొండలను ఎక్కుతూ ఆ కొండల కోనల సౌందర్యానికి పరవశులయ్యారు. సప్తర్షులకు ఒక్కొక్కరికి ఒక్కోరకంగా ఆ క్షేత్రం దర్శనమిచ్చింది. వాళ్లందరూ ఆ క్షేత్రం మీద దర్శనమిస్తున్న శ్రీనివాసభగవానుని అనేకవిధాలుగా కీర్తిస్తూ ఒకరి అనుభూతులను మరొకరితో పంచుకొంటూ పరమానందాన్ని పొందారు.

ఇలా ఒకరికొకరు చర్చించుకుంటున్న తరుణంలో అందరికీ ఒక్క దివ్యమైన ఆలోచన కలిగింది. వారందరూ వారి వారి పేర్లలోని మొదటి అక్షరంతో ప్రారంభించి ఘనవేంకట భగవానుని గూర్చి ఒక్కొక్క శ్లోకంలో శరణుపొందినట్లుగా కీర్తించాలన్నదే అందులోని సారాంశం. అందరూ సరే! అంటే సరే! అనుకున్నారు.

**శేషాచలం సమాసాద్య, కశ్యపాద్యా మహర్షయః**
**వేంకటేశం రమానాథం, శరణం ప్రాపురంజసా**
**కలిసంతారకం ముఖ్యం, స్తోత్ర మేతత్ జపేన్నరః**
**సప్తర్షివాక్ప్రసాదేన విష్ణుః తస్మై ప్రసీదతి**

ఇలా వారు శ్రీనివాసునిమీద చెప్పిన స్తోత్రాలు శ్రీ వేంకటేశ్వరునికి ప్రీతికారకాలయ్యాయి. అంతేకాదు. భక్తులకు కలిసంతారకములై వరలినాయి. అవేమిటో చూద్దాం.

ముందుగా కశ్యపమహర్షి తనకు దర్శనమిచ్చి అనుగ్రహించిన శ్రీవేంకటేశ్వరస్వామిని ఇలా ప్రార్థించాడు.

**కశ్యప ఉవాచ:**

**శ్లో॥ కాది హ్రీమంత విద్యాయాః**
**ప్రాప్యైవ పరదేవతా**
**కలౌ శ్రీ వేంకటేశాఖ్యా**
**తామఽహం శరణం భజే**

క మొదలుగా హ్రీం వరకు గల 16 అక్షరాల బీజాక్షరమంత్రానికి ప్రధానదేవతగా, భాసిస్తున్న సాక్షాత్తు పరదేవతే ఈ కలియుగంలో వేంకటేశ్వరునిగా దర్శనమిస్తున్నది. ఆ దేవుణ్ణి కశ్యపుడనే మునిని శరణం పొందుతున్నాను.

ఆ తర్వాత అత్రి మహాముని ఇలా వర్ణిస్తూ శరణువేడినాడు.

**అత్రిః ఉవాచ:**

**శ్లో॥ అ కారాది క్ష కారాంత**
**వర్ణైః యః ప్రతిపాద్యతే**
**కలౌ స వేంకటేశాఖ్యః**
**శరణం మే రమాపతిః**

**అ** కారం మొదలుగా **క్ష** కారాంతం వరకు గల అన్ని అక్షరాలలో ప్రతిపాదింపబడివున్న రమాపతి ఈ కలియుగంలో సాక్షాత్తు శ్రీవేంకటేశ్వరునిగా భాసిస్తూవున్నాడు. ఆ స్వామివారిని నేను శరణం అంటున్నాను. అంటూ అత్రిమహాముని చేతులెత్తి నమస్కరించాడు.

ఆ తర్వాత భరద్వాజమహర్షి వంతు వచ్చింది. ఆయన శ్రీనివాస భగవానుణ్ణి ఇలా కీర్తించాడు.



**భరద్వాజ ఉవాచ:**

**శ్లో॥ భగవాన్ భార్గవీకాంతో**
**భక్తాభీప్సితదాయకః**
**భక్తస్య వేంకటేశాఖ్యో**
**భరద్వాజస్య మే గతిః**

సాక్షాత్తు భార్గవీకాంతుడు (లక్ష్మీకాంతుడు) ఆయన! భక్తుల కోరికలన్నింటిని తీరుస్తున్న భగవానుడు కూడా ఆయనే! అలాంటి వేంకటేశ్వరుణ్ణి భరద్వాజుడనైన నాకు పరమగతి! వేరే దిక్కు లేనే లేదు.

ఇంతలో విశ్వామిత్రమహర్షి ముందుకు వచ్చి కళ్లు మూసుకొన్నాడు. ఆయన జ్ఞాన నేత్రానికి గోచరించిన శ్రీనివాస భగవానుణ్ణి ఇలా కీర్తించాడు.

**విశ్వామిత్ర ఉవాచ:**

**శ్లో ॥ విరాట్ విష్ణుః విధాతా చ**
**విశ్వం విజ్ఞానవిగ్రహః**
**విశ్వామిత్రస్య శరణం**
**వేంకటేశవిభుస్సదా.**

విరాట్ పురుషుడైన సాక్షాత్తు శ్రీమహావిష్ణువే శ్రీవేంకటేశ్వరుడు! విధాత కూడ ఆయనే! విజ్ఞాన విగ్రహుడైన ఆ శ్రీనివాసుడే విశ్వం అంతాకూడ! అలాంటి సర్వజగత్ప్రభువు, విభుడు అయిన వేంకటేశ్వర స్వామిని ఎల్లవేళలా ఈ విశ్వామిత్రుడు శరణం అంటున్నాడు.

ఆ తర్వాత గౌతమమహర్షి వంతు వచ్చింది. ఆ ముని మనసారా శ్రీనివాసుని ధ్యానిస్తూ తన నామాక్షారంతో ఇలా ప్రారంభించాడు.

**గౌతమ ఉవాచ:**

**శ్లో ॥ గౌః గౌరీశప్రియో నిత్యం**
**గోవిందో గోపతి ర్విభుః**
**శరణం గౌతమస్యాస్తు**
**వేంకటాద్రిశిరోమణిః**

గౌరీప్రియుడు పరమేశ్వరుడు. ఆయనకు అత్యంతప్రియుడు గోవిందుడు! గోవులకు పతి! సమస్తజీవులకు విభుడు!... ఇలా ఇన్నివిధాలుగా వుంటూ వేంకటాద్రి శిరోమణిగా భాసిస్తున్న శ్రీనివాస భగవానుణ్ణి గౌతముడనే నేను శరణం వేడుతున్నాను.

ఇంతలో జ్వలదగ్నివలె ప్రకాశిస్తున్న జమదగ్ని మహర్షి శ్రీవేంకటేశ్వరుణ్ణి ఇలా స్తుతించాడు.

**జమదగ్ని ఉవాచ:**

**శ్లో ॥ జగత్కర్తా జగద్భర్తా**
**జగద్ధర్తా జగన్మయః**
**జగదగ్నిః ప్రపన్నస్య**
**జీవేశో వేంకటేశ్వరః**

సమస్త జగాలను నడిపిస్తున్న కర్త! భరిస్తున్న విభుడు! ధరిస్తున్నవాడు కూడ ఆయనే! ఇన్ని విధాలుగా భాసిస్తూ విశ్వవ్యాపకుడైన జగన్మయుడు సకలజీవేశుడైన వేంకటేశ్వరుణ్ణి జమదగ్ని అనే నేను ప్రపన్నత్వాన్ని పొందుతున్నాను. అనగా శరణు వేడుతున్నాను.

చివరగా సప్తర్షుల్లో అద్వితీయుడైన శిరోమణి అయిన వశిష్ఠమహర్షి ముందుకు వచ్చి ఇలా ప్రార్థించాడు.



**వశిష్ఠ ఉవాచ:**

**శ్లో ॥ వస్తు విజ్ఞాన మాత్రం య**
**న్నిర్విశేషం శుభం చ సత్**
**తత్ బ్రహ్మైవాహ మస్మీతి**
**వేంకటేశం భజే సదా ॥**

ఆశ్రితులైన భక్తులకు నిర్విశేషంగా సంపూర్ణంగా సర్వసుఖాలను అనుగ్రహిస్తూ సాక్షాత్తు పరబ్రహ్మతత్త్వంగా భాసిస్తువున్న శ్రీవేంకటేశ్వర భగవానుణ్ణి వశిష్ఠడనే నేను ఎల్లవేళలా భజిస్తాను.

ఇలా సప్తర్షులు భక్తి ప్రపత్తులతో వేంకటాచలపతిని కీర్తించారు. వీరిస్తుతులకు సంతుష్టుడైన శ్రీనివాసభగవానుడు ప్రత్యక్షమై ఇలా అన్నాడు. మహర్షులారా! మీరు చేసిన స్తోత్రాలు చాల మహిమాన్వితాలు. వీటిని ఎవరు పఠించినా చాలు! పారాయణం చేసినా చాలు! వారికి వున్న సర్వభయాలు, దోషాలు, పాపాలు.. ఇలా అన్నీ తొలుగుతాయి. కేవలం ఇవన్నీ నశించడమేగాక సర్వశ్రేయస్సులు, సర్వశుభాలు కలుగుతాయి. సర్వసంపదలతో వర్ధిల్లుతారు అంటూ వరాన్ని ప్రసాదించాడు శ్రీ వేంకటేశ్వరుడు.

ఇలా సప్తర్షులందరూ తమ జ్ఞానం మేరకు దర్శించిన శ్రీవేంకటాచల పతిని భక్తితో కీర్తించినారు. వీరి స్తోత్రాలు కలిసంతారకాలై వరలినాయి.

**శ్లో ॥ సప్తర్షిరచితం స్తోత్రం**
**సర్వదా యః పఠేన్నరః**
**సోఽభయం ప్రాప్నుయాత్**
**సత్యం సర్వత్ర విజయీ భవేత్**

వీటిని పఠిస్తేచాలు. అభయం సిద్ధిస్తుంది. సర్వత్రా విజయాలు చేకూరుతాయి.

* * *

## శ్రీ శైలం

వక్షస్థల మహాలక్ష్మీ సమేతుడైన శ్రీనివాసుడు **'కలౌ వేంకట నాయకః'** అన్న ప్రసిద్ధితో కోరిన వారందరికీ సంపదలను ప్రసాదిస్తున్నాడు.

**శ్లో॥ శ్రీప్రదత్వాత్ శ్రియో వాసాత్ శబ్దశక్త్యా చ యోగతః**
**రూఢ్యా శ్రీశైల ఇత్యేవం నామ చాస్య గిరేరభూత్.**

అంతేకాదు.

**క. శ్రీసతి యా వరగిరిపై**
**వాసముగా నుండి విపులవైభవ మెసఁగన్**
**భాసిల్లుచు నుండఁగ నది**
**శ్రీసద్గిరి యనఁగ నొప్పు క్షితిపై నెపుడున్**

**-శ్రీవేంకటాచలమాహాత్మ్యం- ఆశ్వాసం-1.పద్యం-120.**

శ్రీమహాలక్ష్మి వసిస్తున్నందువల్లే **'శ్రీశైలం'** అనీ **'శ్రీసద్గిరి'** అనీ.. ఇలా అనేకపేర్లతో పిలవబడుతూ వింత వింత తేజస్సులతో ప్రకాశిస్తున్నదని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ వర్ణించింది.

శ్రీప్రదమైన, శాశ్వతమైన సిరులను కురిపిస్తూ లక్ష్మీసమేతుడై శ్రీనివాసుడు ఉన్న ఈ కొండ **'శ్రీశైలం"** అని ప్రసిద్ధిని పొందింది.

* * *



ఇలాగ అనేక యుగాల్లో అనేక పేర్లతో విరాజిల్లుతున్న అద్భుతమైన మహిమలు వున్న దివ్యక్షేత్రం వేంకటాచలం! ఈ క్షేత్రానికి వున్న అనంత నామాలలో తెలిసినంతవరకు కొన్ని పేర్లనైనా స్మరించినా చాలు! సకల దురితాలు చాల సులువుగా తొలగిపోతాయి. మరికొన్ని పేర్లను ఉచ్చరించినా చాలు! అనేక జన్మల్లో తెలిసీ, తెలియక మనసా, వాచా, కర్మణా చేసిన ఎన్నో పాపాలు ఇట్టే నశిస్తాయి. అద్భుతమైన వేంకటాచలయాత్రకు వెళ్లి ఆ దివ్య క్షేత్రాన్ని తాకితే చాలు! భయంకరమైన కర్మరోగాలు, నశించి ఆరోగ్యం సిద్ధిస్తుంది. ప్రారబ్ధ, సంచిత, ఆగామి కర్మల ఫలితాలు అన్నీ నశిస్తాయి.

వేంకటాచలయాత్రకు వెళ్లాలి అని సంకల్పిస్తే చాలు! ఒక ఆనందం. కుటుంబ సభ్యులతో కొండకు బయలుదేరితే చాలు. అది చెప్పలేని ఆనందం! ఏడు కొండలలో విహరిస్తే చాలు! వింత వింత అనుభూతులతో కూడిన విచిత్రమైన ఆనందం! ఆ కొండపై అఖిలాండ కోటి బ్రహ్మాండనాయకుని 'బంగారు మేడ' ఆనందనిలయ విమానాన్ని తలపైకెత్తి చూస్తే చాలు చాలు! తన్మయంతో కూడిన ఒక దివ్యానందం! ఆ బంగారువిమాన అంతర్భాగంలో మనం అందరికోసం ఎదురుచూస్తున్న ఏడు కొండలవాణ్ణి ఒకే ఒక్క క్షణం, కన్నులార్పక, కన్నుల నిండా దర్శిస్తే చాలు! చాలు! అవ్యక్తమైన అనంతమైన ఆనందంతో కూడిన అనుభూతి నిలువెల్ల కలుగుతుంది.

## తిరుమల యాత్రలో నియమాలు

ఇలాంటి ఆనంద పరంపరల్ని సంపూర్ణంగా పొందాలి. సొంత చేసుకోవాలి అన్నవారు వేంకటాచలయాత్రలో కొన్ని నియమాలు తప్పక పాటించాలి. విధిగా ఆచరించాలి.తప్పదు మరి!

ముందుగా వేంకటాచల క్షేత్రాన్ని ఎక్కే సమయంలో భక్తి ప్రపత్తులతో ప్రార్థించాలి.

**శ్లో॥ వేంకటాద్రిం గిరిం తంతు ప్రార్థయే పుణ్యవర్ధనమ్**
**స్వర్ణాచల! మహాపుణ్య! సర్వదేవనిషేవిత!**
**బ్రహ్మాదయోఽపి యం దేవాః సేవంతే శ్రద్ధయా సహ**
**తం భవంత మహం పద్భ్యాం ఆక్రమేయం నగోత్తమ**
**క్షమస్వ తదఘం మేఽద్య దయయా పాపచేతసః**
**తన్మూర్ధని కృతాఽఽవాసం మాధవం దర్శయస్వ మే**
**ప్రార్థయిత్వా నరస్త్వేవం వేంకటాద్రిం నగోత్తమమ్**
**తతో మృదుపదం గచ్ఛేత్ పావనం వేంకటాచలమ్.**
**వేంకటాద్రౌ మహాపుణ్యే సర్వపాతకనాశనే**
**స్వామిపుష్కరిణీ తీర్థే స్నాత్వా నియమపూర్వకమ్**
**పిండదానం తతః కుర్యాత్ అపి సర్షపమాత్రకమ్**
**శమీదలసమానాన్వా దద్యా త్పిండాన్ పితౄన్ప్రతి**
**స్వర్గస్థా మోక్షమాయాంతి స్వర్గం నరకవాసినః**

మొదట తిరుమలకొండ దగ్గరికి వెళ్లాలి. రెండుచేతులెత్తి నమస్కరించాలి. ఆ కొండను ఎక్కడానికి ప్రారంభించేముందు ఇలా ప్రార్థించాలి.

"ఓ బంగారు పర్వతమా! సకలదేవతల చేత సేవింప బడుతుంటావు. బ్రహ్మాది దేవతలు నియమ నిష్ఠలతో, భక్తి శ్రద్ధలతో నిన్ను పూజిస్తుంటారు. అలాంటి నీ పైన నేను నా కాళ్లను మోపుతున్నాను. అందుకు నీవు నిండు దయ కలిగి నన్ను క్షమించు. పాదాలను మోపుతున్నందుకు సంక్రమించే పాపాలను, దోషాలను నన్ను చేరకుండా క్షమించడంతో పాటు, అత్యంత



పవిత్రమైన నీ పర్వతశిఖరంపైన నిలిచి వేయి విధాలుగా ప్రకాశిస్తున్న శ్రీనివాసప్రభువులను నా చేత దర్శింపజేయి" అంటూ ప్రదక్షిణ పూర్వకంగా సాష్టాంగ దండప్రణామాలను చెయ్యాలి. రెండు చేతులను కొండ మొదటి మెట్టుపై ఉంచి శిరస్సును తాకించి నమస్కరించాలి.

ఆ పిదపనే పాదాలను అత్యంత మృదువుగా మెల్లగా మోపుతూ పరమపావనమైన తిరుమల కొండను ఎక్కాలి. అంతే తప్ప కఠినంగా, కర్కశంగా ఎక్కరాదు. 'ధమ ధమా'! అంటూ కాళ్లతో చప్పుడు చేసుకొంటూ పరిగెత్తరాదు.

కొండ దారిలో నడిచి వెళ్లే తోటి యాత్రికులకు ఎలాంటి ఇబ్బంది కలిగించరాదు. కూడదు. మౌనంగా జపం చేస్తూ కొండ నెక్కాలి. లేదా గోవిందనామాలు జపించాలి తప్ప అనవసర ప్రసంగాలు చెయ్యరాదు. కొండకు చేరుకున్న తర్వాత ముందుగా దర్శనం మాత్ర చేతనే సర్వపాపాలను పోగొట్టే మహాపవిత్రమైన "శ్రీస్వామిపుష్కరిణీ" తీర్థాన్ని దర్శించి నమస్కరించాలి. ఆ తర్వాతనే ఆ పుణ్యజలాల్లో దిగి సంకల్ప పూర్వకంగా స్నానం చెయ్యాలి. అక్కడే ఆ తీర్థంలోనే సంకల్ప పూర్వకంగా పితృతర్పణ చెయ్యాలి. వీలును బట్టి ఆవగింజంత అయినా, జమ్మిఆకు అంతైనా పిండాలతో పితృదేవతలకు శ్రాద్ధాలు చేయ్యాలి. ఏమాత్రం వీలుకాకపోయినా పితృదేవతలను స్మరిస్తూ జలతర్పణం చేస్తే చాలు. అలా చేసినట్లైతే స్వర్గంలో వుండే పితృదేవతలు మోక్షాన్నీ, నరకంలో వుండే పితృదేవతలు స్వర్గాన్నీ పొందుతారు. తర్పణాదులు చేసినవారికి సకల శ్రేయస్సులు కలుగుతాయి. వంశాభివృద్ధి కలుగుతుంది.

'శ్రీస్వామిపుష్కరిణీ" పవిత్ర తీర్థంలో స్నానాదికాలు ముగించు కొన్న తర్వాత క్షేత్ర సంప్రదాయం ప్రకారం అక్కడే పశ్చిమ తీరంలో వున్న తొలి

దైవం అయిన శ్రీ భూవరాహస్వామివారిని ముందుగా దర్శించి పూజించాలి. వరాహస్వామి జ్ఞానాన్నీ ప్రసాదిస్తాడు. జ్ఞానం సిద్ధించిన భక్తునికి ఆనందం కరతలామలకం. అందువల్లే ఆ తర్వాత ఆనందనిలయుని దర్శించవలె. ఇలా క్షేత్ర విధులు అన్నీ పూర్తి అయిన తర్వాత ఏడుకొండల్లో నెలకొన్న వీలయినన్ని తీర్థాలను సందర్శించాలి. వాటిల్లో స్నానాలు చెయ్యాలి. దానాలు చెయ్యాలి.

## తిరుమలలో దానధర్మాలు - ఫలితాలు

ఏడుకొండలవాని సన్నిధిలో ఏ దానం చేసినా, వితరణ చేసినా ముఖ్యంగా గమనించవలసింది సత్పాత్రత. సత్పాత్రులకు దానం చేస్తే సంపూర్తిగా ఫలవంతమవుతుంది. ప్రధానంగా తిరుమల కొండమీద ఒక్కటిగ దానం చేస్తే దానికి వేయి రెట్లు అధికంగా సత్ఫలితం కలుగుతుంది.

అలాగే శ్రీవేంకటాచలదివ్య క్షేత్రంలో ఏ చిన్న తప్పు చేసినా, అల్పమైన దోషం చేసినా అధికంగా పాప ఫలితాన్ని మూటకట్టుకోక తప్పదు. తిరుమల క్షేత్రంలో సంచరించే సమయంలో అనుక్షణం సదాలోచనలతో సద్భావనలతో భగన్నామసంకీర్తనలతో కాలక్షేపం చెయ్యాలి.

**తిరుమల క్షేత్రం విహారక్షేత్రం కానే కాదు. వినోదక్షేత్రం అసలే కాదు. అది ఒక సిద్ధి క్షేత్రం! ఒక సాధనా క్షేత్రం! ఆ క్షేత్రంలో ఎంత సాధన చేస్తే అంత ఫలితం సిద్ధిస్తుంది.**

**ఆ సాధన ఎలాగుండాలి?**

సాధనలుగా తపస్సు చేయవచ్చు. ధ్యానం చేయవచ్చు. జపం చేయవచ్చు. గ్రంథ పారాయణలు చేయవచ్చు. సంకీర్తన చేయవచ్చు.



భజనలు చేయవచ్చు. పురాణ ప్రవచనం చేయవచ్చు. క్షేత్రశుద్ధికి -- పరిశుభ్రతకు శ్రమదానం చెయ్యవచ్చు. క్షేత్ర సౌందర్యాన్ని పెంచే పూలవనాలకు తోడ్పడవచ్చు. శ్రీనివాసుని భక్తులకు యాత్రికులకు సేవలందించవచ్చు. యాత్రికులకు అన్నదానాలు, వస్త్రదానాలు చెయ్యవచ్చు. మందులను ఉచితంగా ఇవ్వవచ్చు. ఇలా దానాలను ఎన్నైనా చేయవచ్చు.

ప్రధానంగా ఏడుకొండలవాని పూజకోసం కర్పూరం, చందనం, శంఖం, ఆభరణాలు, సమర్పించినట్లయితే మహాపాతకాలు నశిస్తాయి. శ్రీస్వామివారికి భూములను దానంగా ఇస్తే సంసార బంధాలతో విడివడి ముక్తిని పొందుతారు. శ్రీ వేంకటభగవానుని ఉత్సవాలకుగాని, ఊరేగింపులకుగాని రథాలను, వాహనాలను నిర్మించి సమర్పణం చేసికొన్నట్లయితే కోటి కన్యాదానాలు, పది వేల గోవులను దానం చేసిన సత్ఫలితం కలుగుతుంది.

గొడుగు, విసనకర్రలు, చామరాలు, బంగారు పుష్పాలు, ఏనుగులు, గుర్రాలు మున్నగు వాటిని శ్రీనివాసునికి దానం చేస్తే తర్వాతి జన్మల్లో చక్రవర్తి అవుతాడు.

వేంకటాచలక్షేత్రంలో శ్రీ స్వామివారిసన్నిధిలో ఆవునేతితో జ్యోతులను, వెలిగిస్తూ, తమ పూర్వులను స్మరించినట్లయితే, తాము, తమ పూర్వులు చేసిన పాతకాలన్నీ నశిస్తాయి. ఉత్తరోత్తరాభివృద్ధి కలుగుతుంది.

ఏడుకొండలలో నెలవైవున్న పవిత్ర తీర్థాల్లో స్నానం చేసిన తర్వాత బంగారు, గోవులు, వెండి, భూమిని, దక్షిణ తాంబూలాదులను, సుగంధ ద్రవ్యాలను దానం చెయ్యాలి.

తిరుమల క్షేత్రంపై శ్రీవేంకటేశ్వరుని మించిన దానగ్రహీత ఎవరున్నారు? అందుచేత దేవస్థానం నిర్వహించే ఏ సత్కార్యానికైనా వితరణలు చేయవచ్చు. దానాలు చేయవచ్చు. ఈ మాధవుడు చేస్తున్న మానవ సేవా కార్యక్రమాలు ఎన్నో! ఎన్నెన్నో!! వాటి అన్నింటికీ తృణమో పణమో సమర్పించి భాగస్వాములు కావచ్చు.

ఇలా తిరుమల యాత్రకు రావడం, ఏడుకొండల్లో విహరించే భాగ్యం కలగడం, సాక్షాత్తు శ్రీనివాస భగవానుని అనుగ్రహం వల్ల మాత్రమే సిద్ధిస్తుంది. కనుక తిరుమల క్షేత్రంలో సంచరించే క్షణాలను సద్వినియోగం చేసుకోవాలి. ఈ యాత్రలో ప్రధానధ్యేయమగు ఏడుకొండలవాడి మీద నిరంతరం ధ్యాస ఉంచాలి.

**శ్లో॥ శ్రీ వేంకటేశ్వరం దేవం యః పశ్యతి సకృన్నరః**
**స నరో ముక్తిమాప్నోతి విష్ణుసాయుజ్యమాప్నుయాత్**

శ్రీ వేంకటేశ్వరస్వామిని ఒక్కమారు దర్శించిన మాత్రాన చాలు. మోక్షం సిద్ధిస్తుంది. ఏ మాత్రం ఎలాంటి సాధనా అవసరం లేదు. కృతయుగంలో పదేండ్లు, ఒక ఏడాది త్రేతాయుగంలో, ద్వాపరంలో ఐదునెలలు, కలియుగంలో ఒకరోజున సంపాదించే పుణ్యానికి కోటిరెట్లు అధికంగా ఒక్క క్షణంపాటు శ్రీస్వామివారిని దర్శించిన వెంటనే లభిస్తుంది. ఇందులో ఎంతమాత్రం సందేహం లేదు.

అందువల్ల 'తిరుమల యాత్రలో అడుగడుగునా, అనుక్షణం అప్రమత్తంగా వుంటూ ఆనందనిలయుణ్ణి భజించుదాం. ఆ యాత్రా సమయంలో ఏడుకొండల మీద విహరించే అమూల్యమైన కాలాన్ని ఆనందంగా గడుపుతూ సద్వినియోగం చేసుకొందాం. తద్వారా ఆధ్యాత్మికాను



భూతులను పొందుదాం. ఆ ఏడుకొండల్లో ఆనందనిలయ విమాన అంతర్భాగంలో దర్శనమిస్తూ అందరిని నిండుగా, మెండుగా అనుగ్రహిస్తున్న సర్వలక్ష్మీ పరిపూర్ణుడైన శ్రీనివాస ప్రభువును ఇలా ప్రార్థించుదాం.

**శ్లో॥ వక్త్రాబ్జే భాగ్యలక్ష్మీః కరతలకమలే సర్వదా దానలక్ష్మీః**
**దోర్దండే వీరలక్ష్మీర్హృదయ సరసిజే భూతకారుణ్యలక్ష్మీః**
**ఖడ్గాగ్రే శౌర్యలక్ష్మీః నిఖిల గుణగణాడంబరే కీర్తిలక్ష్మీః**
**సర్వాంగే సౌమ్యలక్ష్మీ ర్మయితు విజయతాం సర్వసామ్రాజ్యలక్ష్మీః.**

**శ్లో॥ శ్రీవత్సవక్షసం! శ్రీశం!**
**శ్రీలోలం శ్రీకరగ్రహమ్**
**శ్రీమంతం శ్రీనిధిం శ్రీఢ్యం**
**శ్రీనివాసం భజేఽనిశమ్.**

ఇలా ఆపాద మస్తకం శ్రీమహాలక్ష్మీ సుసంపన్నుడూ, ఏడుకొండలవాడూ అయిన శ్రీనివాసప్రభువు నాకు విజయం కలిగించు గాత!

**ఓం నమో శ్రీవేంకటేశాయ**

* * *

## ఇప్పుడిటు కలcగంటి

ఇప్పు డిటు కలcగంటి నెల్ల లోకములకు-
నప్పడగు తిరువేంకటాద్రీశుc గంటి ॥

అతిశయంబైన శేషాద్రిశిఖరము గంటి
ప్రతిలేని గోపురప్రభలు గంటి
శతకోటి సూర్యతేజములు వెలుగగ గంటి
చతురాస్యు పొడగంటి చయ్యన మేలుకొంటి ॥

కనకరత్న కవాట కాంతు లిరుగడc గంటి
ఘనమైన దీపసంఘములు గంటి
అనుపమ మణిమయమగు కిరీటము గంటి
కనకాంబరము గంటి గ్రక్కన మేలుకొంటి ॥

అరుదైన శంఖచక్రాదు లిరుగడ గంటి
సరిలేని యభయహస్తముc గంటి
తిరు వేంకటాచలాధిపునిcజూడగc గంటి
హరిc గంటి గురుc గంటి నంతట మేలుకంటి ॥

– తాళ్లపాక అన్నమాచార్యులవారి అధ్యాత్మ కీర్తన



## కంటి నఖిలాండతతి కర్త

కంటి నఖిలాండతతి కర్తనధికుని గంటి
కంటి నఘములు వీడుకొంటి నిజమూర్తి గంటి ॥


మహనీయ ఘన ఫణామణుల శైలము గంటి
బహు విభవముల మంటపముల గంటి
సహజనవరత్న కాంచన వేదికలు గంటి
రహి వహించిన గోపురంబులవె కంటి ॥

పావనంబైన పాపవినాశనము గంటి
కైవశంబగు గగనగంగc గంటి
దైవికపు పుణ్యతీర్థములెల్ల పొడగంటి
కోవిదులు కొనియాడు కోనేరు గంటి ॥

పరమయోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్యహస్తము గంటి
తిరువేంకటాచలాధిపు చూడగంటి ॥

– తాళ్లపాక అన్నమాచార్యులవారి అధ్యాత్మ కీర్తన

# సమర్పణం



**"కొండలలో నెలకొన్న కోనేటిరాయడు వాడు**
**కొండలంత వరములు గుప్పెడు వాడు"**

మహోన్నతమైన మహిమాన్వితమైన **ఏడు కొండల** మధ్య నెలకొన్న దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామి. ఈ కలియుగంలో అందరిపాలిటికి ఏకైక దిక్కై

**"కలౌ వేంకట నాయకః"**

అన్న ప్రసిద్ధితో ఆపద్బంధువై, ఆత్మబంధువై భక్తులను కాచి రక్షిస్తున్న కొండంత దేవుడు ఏడుకొండలవాడి దివ్య పాద పద్మాల మీద

అక్షరాత్మకమైన

## 'ఏడు కొండలు'

అనే ఈ పుస్తక సుమాన్ని భక్తి పూర్వకంగా సమర్పిస్తున్నాను.

**ఓం నమో శ్రీ వేంకటేశాయ**